జూనియర్ లైన్‌మాన్‌పై విచారణ

● రంగంలోకి విజిలెన్స్ బృందం



గాలివీడు లైన్‌మాన్‌పై విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గాలివీడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న జూనియన్ లైన్‌మాన్ రామేశ్వర్‌రెడ్డి అక్రమ వసూళ్లపై విజిలెన్స్ బృందం విచారణ చేపట్టింది. బుధవారం గాలివీడు మండలంలో ట్రాన్స్‌కో ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో తన సిబ్బందితో కలిసి గాలివీడు పట్టణంలోని చిలకలూరిపేట, ఎగువగొట్టివీడు గ్రామాల్లో పర్యటించి బాధితుల వద్ద నుంచి జూనియర్ లైన్‌మాన్ ఎంత డబ్బులు వసూలు చేశారన్న విషయంపై రాతపూర్వకంగా వారి వద్ద నుంచి స్టేట్‌మెంట్ రికార్డ్ చేసుకున్నట్లు తెలిపారు. అయితే అధికారులు ఆకస్మికంగా విచారణకు రావడంతో కొందరు కూలి పనులకు వెళ్లడంతో అందుబాటులో ఉన్న వారు మాత్రమే తమ గోడును విన్నవించుకున్నారు. ఇదే విషయమై అధికారుల దృష్టికి తీసుకురాగా ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే నేరుగా తమ కార్యాలయంలో గానీ, ఫోన్‌లో గాని వివరాలు చెప్పవచ్చన్నారు. ఇదిలా ఉండగా అక్రమ వసూళ్లపై లోతుగా విచారించిన అధికారులు కరెంటు బిల్లుల రూపంలో ఎంత వసూలు చేశాడు..? రీడింగ్ బాక్స్ అమర్చే పేరుతో డమ్మీ బాక్స్‌లు బిగించి ఎంత వసూలు చేశారు..? అప్పు పేరుతో ఎంత వసూలు చేశాడు..? ఆన్‌లైన్ బెట్టింగ్ తదితర అంశాలపై క్షుణ్ణంగా వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

దొరకునా ఇటువంటి సేవ...

● హనుమంత వాహనంపై శ్రీరాముడు విహారం
● వైభవంగా కోదండరాముడి బ్రహ్మోత్సవాలు





హనుమంత వాహనంపై విహరిస్తున్న కోదండరాముడు



ఒంటిమిట్ట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్ట కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగోరోజు బుధవారం శ్రీరాముడు హనుమంత వాహనంపై విహరించారు. బుధవారం ఆలయ అర్చకులు మూలవిరాట్‌లకు అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సీతారామ లక్ష్మణులు హనుమంత వాహనంపై ఊరేగారు. దారి పొడవునా భక్తులు కోలాటాలు నిర్వహించారు. ఉదయం శ్రీరామచంద్రుడు నవనీత కృష్ణాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కృష్ణుడు వెన్న దొంగ రేపల్లెలో బాలకృష్ణుడు వెళ్లి వెన్న ఆరగించేవారు. చిన్నికృష్ణుడి లీలలను గుర్తు చేసుకుంటూ రాములవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 11 గంటలకు కంకణభట్టర్ రాజేశ్వర్‌కుమార్ స్వామి వారికి స్నపన తిరుమంజనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేషబాబు, అధికారులు హనుమంతయ్య, నవీన్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాలకు హాజరైన భక్త జనం



నవనీతకృష్ణాలంకారంలో రామయ్య విహారం

కోలాటం ప్రదర్శన



శ్రీరామ..జయరామ..పట్టాభిరామ...

● రమణీయం..పట్టాభిరాముడి రథోత్సవం



వాల్మీకిపురం పురవీధుల గుండా వైభవంగా రాముడి రథోత్సవం



బ్రహ్మరథంపై పూజలందుకుంటున్న సీతారామలక్ష్మణులు

వాల్మీకిపురం, ఏప్రిల్ 9: శ్రీరామ..జయరామ..పట్టాభిరామ..రామ నామ స్మరణతో వాల్మీకిపురం క్షేత్రం మార్మోగింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం టీటీడీ ఆధ్వర్యంలో రాముడి రథోత్సవం వైభవంగా జరిగింది. తొలిపూజ అనంతరం అశేష భక్తజనం నడుమ పట్టాభిరాముడి రథోత్సవ కార్యక్రమం రమణీయంగా సాగింది. తిరుమాడ వీధుల్లో భక్తులు రథంపై మిర్యాలు, బొరుగులు చల్లుతూ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా భక్తుల కోసం డ్రైవర్స్ అసోసియేషన్, వాసవీ సంఘం, మానవతా సేవా సంస్థ, సాయి నారాయణ సేవ, వివిధ సేవా సంస్థల ఆధ్వర్యంలో అన్నదానం, మజ్జిగ, తాగునీటి పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం స్థానిక హరిమందిరం వద్దకు చేరుకున్న బ్రహ్మరథం విరామం అనంతరం తిరిగి సాయంత్రం 4 గంటలకు ముగిసింది. కోలాటలు, చెక్కభజనలు, టీటీడీ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. బ్రహ్మోత్సవాలలో ఎలాంటి సంఘటనలు జరగకుండా సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ చంద్రశేఖర్‌లు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ మునిబాలకుమార్, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, టీటీడీ ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు, కృష్ణప్రసాద్ భట్టార్, కృష్ణరాజు, సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, భాషికాచార్యులు, ధనుష్‌భట్టార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలలో నేడు : పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం తిరుచ్చి ఉత్సవం, సాయంత్రం అశ్వవాహన సేవ, పార్వేట ఉత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి.

కల్యాణోత్సవానికి పటిష్ట బందోబస్తు

● సిబ్బందితో ఎస్పీ అశోక్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

సీతారాముల కల్యాణోత్సవానికి వేలాది మంది భక్తులు రానున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు కడప జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం కల్యాణవేదిక వద్ద బందోబస్తు విధుల్లో పాల్గొన్న అధికారులతో వారి విధులపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎవరికి కేటాయించిన విధులను వారు అప్రమత్తంగా ఉండి నిర్వర్తించాలన్నారు. పార్కింగ్ స్థలాల వద్ద వాహనాలకు క్రమపద్ధతిలో ఉంచేలా పర్యవేక్షించాలన్నారు. బారికేడ్‌లు, చెక్‌పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు, ఎస్పీ రమణయ్య, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఒంటిమిట్ట సీఐ బాబు, ఎస్ఐ శివప్రసాద్‌తో పాటు జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతారాముల కల్యాణోత్సవానికి శ్రీవారి లడ్డూ

ఒంటిమిట్ట సీతారామ కల్యాణోత్సవానికి విచ్చేసే భక్తులకు అందించేందుకు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని సిద్ధం చేశారు. తిరుమలలోని శ్రీవారి సేవకుల సహకారంతో లడ్డూల ప్యాకెట్లను తయారు చేశారు. టీటీడీ డిప్యూటీ ఈవో శివప్రసాద్, ఏఈవో బాలరాజు ఆధ్వర్యంలో సుమారు 300 మంది శ్రీవారి సేవకులు 70 వేల ప్యాకెట్లు ప్యాకింగ్ చేశారు. కోదండరాముడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 11న జరగనున్న సీతారాముల కల్యాణం ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు లడ్డూ ప్రసాదాలను అందజేయనున్నారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.



లడ్డూలు ప్యాకింగ్ చేస్తున్న శ్రీవారి సేవకులు

పెండింగ్ పనులను పూర్తి చేయాలి

● కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన అదనపు ఈవో



కల్యాణవేదికను పరిశీలిస్తున్న అదనపు ఈవో

భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్యచౌదరి తెలిపారు. బుధవారం టీటీడీ జేఈవో వీరబ్రహ్మంతో కలిసి ఆయన కల్యాణోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంతి చంద్రబాబునాయుడు కల్యాణానికి వస్తున్నారని, ముఖ్యమంత్రి బస చేసే గదుల్లో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. విద్యుత్ కోతలు లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసర ప్రాంతాల్లో పచ్చదనం, పుష్పాలంకరణలు తాజా పుష్పాలతో ఏర్పాటు చేయాలన్నారు. పుష్పాలంకరణలో రాజీ పడకుండా నాణ్యతతో కూడిన పనులు చేయాలన్నారు. జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీటీడీ సీఈ సత్యనారాయణ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

12న మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పర్యటన

● విజయవంతం చేయండి : జగన్‌మోహన్‌రాజు



సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు

రాజంపేట టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటకు ఈనెల 12న విచ్చేస్తున్న అన్నమయ్య జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొట్టమొదటిసారిగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి రాజంపేట కార్యకర్తల సమావేశంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల్లో ఎలాంటి గ్రూపు విభేదాలు లేవని, ఉన్నదల్లా సీఎం చంద్రబాబు, నారా లోకేశ్ ఒకే ఒక గ్రూపు మాత్రమే అని తెలిపారు. పసుపు జెండా పట్టిన ప్రతి కార్యకర్త ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ నేతలు అద్దేపల్లె ప్రతాప్‌రాజు, గన్నే సుబ్బనరసయ్య, అనసూయమ్మ, డీఆర్ఎల్ మణి, అబూబకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

అడవిలో దారి తప్పిన ఎక్సైజ్ సిబ్బంది

● సురక్షితంగా కాపాడిన పోలీసులు



ఎక్సైజ్ ఎస్ఐ వరుణ్‌తో ఓబులవారిపల్లి ఎస్ఐ మహేష్‌నాయుడు

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఓబులవారిపల్లి మండలంలోని వై.కోట అడవిలో దారి తప్పిన ఎక్సైజ్ శాఖ సిబ్బంది కథ సుఖాంతమైంది. ప్రభుత్వం చేపట్టిన నవోదయ కార్యక్రమంలో భాగంగా నాటుసారా నిర్మూలనే లక్ష్యంగా వై.కోట అడవిలోకి కోడూరు సీఐ తులసి, ఎస్ఐ వరుణ్‌కుమార్ తమ సిబ్బందితో బుధవారం ఉదయం అడవిలోకి వెళ్లారు. సమాచారం తెలుసుకున్న నాటుసారా తయారీదారులు పారిపోయారు. తయారీకి సిద్ధంగా ఉన్న మూడు ప్లాస్టిక్ డ్రమ్ముల్లోని సుమారు 200 లీటర్ల బెల్లం ఊటను అధికారులు ధ్వంసం చేశారు. అయితే వారు తిరుగు ప్రయాణంలో దారి తప్పారు. అటవీ శాఖాధికారి శ్యాంసుందర్, ఓబులవారిపల్లి ఎస్ఐ మహేష్‌నాయుడికి సమాచారం అందించి తమ మొబైల్ లొకేషన్ పంపారు. వెంటనే స్పందించిన ఓబులవారిపల్లి ఎస్ఐ మహేష్‌నాయుడు తమ సిబ్బందితో కలిసి ఎక్సైజ్ సిబ్బంది ఉన్న ప్రదేశాన్ని గుర్తించి వారిని రక్షించారు. దట్టమైన అడవిలో చిక్కుకుపోయిన ఎక్సైజ్ సిబ్బందిని పోలీసులు సురక్షితంగా కాపాడటంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా అదే అటవీ ప్రాంతంలో ఇటీవల జరిగిన ఏనుగుల దాడిలో తలకోనకు వెళ్తున్న ముగ్గురు భక్తులు మృతి చెందిన విషయం విదితమే.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

● బాధితులకు న్యాయం చేయాలి
● కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్



ములకలచెరువు సర్కిల్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న కర్నూల్ రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్

ములకలచెరువు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌స్టేషన్లకు వచ్చే ఫిర్యాదుదారులతో గౌరవ, మర్యాదలతో ప్రవర్తించాలని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఆదేశించారు. స్థానిక సర్కిల్ కార్యాలయాన్ని ఆయన బుధవారం తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదులపై తక్షణం స్పందించి బాధితులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలన్నారు. మహిళలు, యువతులు తప్పనిసరిగా సెల్‌ఫోన్లలో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ప్రతి వారం మహిళా పోలీసులతో కలిసి పాఠశాలలు, పబ్లిక్ ప్రదేశాలలో మాదకద్రవ్యాలు, బాల్యవివాహాలు, మహిళలపై జరిగే నేరాలు, ఆన్‌లైన్, సైబర్ మోసాలు, వైట్ కాలర్ నేరాలపై అవగాహనా సదస్సులు నిర్వహించాలన్నారు. అపార్ట్‌మెంట్లు, షాపుల్లో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించి వాటిని అమర్చుకునేలా చూడాలన్నారు. పోలీస్ అధికారులు, మహిళా పోలీసులు బాగా పనిచేసి లోక్‌అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు రాజీ, పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. ట్రాఫిక్, ఈ-చలాన్‌ల పెండెన్సీని తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. నేరాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలన్నారు. అనంతరం ములకలచెరువు సర్కిల్ పరిధిలో పెండింగ్ కేసుల గురించి ఆరా తీశారు. నేరాల సంఖ్య, శాంతిభద్రతల పరిస్థితి, సిబ్బంది పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు, సీఐ లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

మసకబారిన మామిడి



కొన్నిచోట్ల అరకొరగా పిందెదశలో ఉన్న బేనీషా పంట

ఇంకా పూత దశలో ఉన్న నీలం చెట్లు





పూర్తిగా పాడైపోయిన పూత

● 20 శాతానికి పడిపోయిన దిగుబడి
● మూడు దశల్లో ఉన్న అరకొర పంట
● వాతావరణ పరిస్థితులతో రైతులకు భారీ నష్టాలు
● రూ.250 కోట్ల నుంచి 100 కోట్లకు పడిపోనున్న వ్యాపారం

రాజంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మామిడి పంట మసకబారిపోయింది. డిసెంబరు పూత పూసి ఏప్రిల్ నుంచి దిగుబడి వచ్చే మామిడి పంట వాతావరణ మార్పుల వల్ల ఇప్పటికీ కొన్నిచోట్ల నీలంచెట్లు పూతదశలో ఉంటే అంటుమామిడి, పోలూర లాంటి కాయలు వారం రోజుల లోపు పక్వానికి వచ్చి మార్కెట్‌కు చేరే పరిస్థితి ఉంది. మరికొన్ని చోట్ల బేనీషా, ఇతర రకాల చెట్లు పిందె దశలో ఉన్నాయి. మూడు దశల్లో అనగా పూత, పిందె, కాయల దశలో ఈ పంట ఉంది. అయితే పంట అంతా 80 శాతం పాడైపోయింది. ఒక వైపు బంక తెగుళ్లు, ఇతరత్రా తెగుళ్లు సోకడం, దానికి తగ్గట్టు విపరీతమైన ఎండలు రావడం, వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం వల్ల 80 శాతం పూత అంతా మాడిపోయింది. పిందె రాకుండానే పూత అంతా మాడిపోయి రాలిపోయింది. ఉన్న 20 శాతం పంట కూడా మూడు దశల్లో ఉంది. ఈ ఏడాది మామిడి వ్యాపారం గత ఏడాది లాగనే కుప్పకూలిపోనుంది. రాజంపేట డివిజన్ పరిధిలోని రైల్వేకోడూరు, వీరబల్లె, ఓబులవారిపల్లె, పెనగలూరు, చిట్వేలి, పుల్లంపేట, మండలాల్లో సుమారు 30 వేల ఎకరాల్లో మామిడి పండుతోంది. సుమారు 30 రకాలు నీలిమా, అంటిమామిడి, బేనేసా, పులిహోరా, నీలం లాంటి అనేక రకాలుగా మామిడి దిగుబడి అవుతుంది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఈ పంట వ్యాపారం జరుగుతుంది. ప్రధానంగా ఒక్క రైల్వేకోడూరు నుంచి రూ.250 కోట్ల మామిడి వ్యాపారం సాగుతోంది. అటువంటిది గత ఐదు సంవత్సరాలుగా ఈ పంట వాతావరణ పరిస్థితుల వల్ల ఏడాదికేడాది తగ్గిపోతోంది. పెట్టిన పెట్టుబడులు, దుక్కులు దున్నకం, మందుల పిచికారీ తదితరాలకు ఎకరాకు రూ.30 వేలు ఖర్చవుతోంది. బాగా పండి గిట్టుబాటు ధరలు ఉంటే ఎకరాకు లక్షన్నర వరకు ఆదాయం వస్తుంది. అటువంటిది పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితులు లేవు. తెగుళ్లు సోకడం వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, పంట బాగా పండినా జాతీయ మార్కెట్‌లో డిమాండ్ లేక గిట్టుబాటు ధరలు లభించకపోవడం, గిట్టుబాటు ధరలు ఉన్నప్పుడు దిగుబడి లేకపోవడం వల్ల ఈ పంట వల్ల ప్రయోజనం లేకుండా ఉంది. ఏడాదిలో రూ.250 కోట్లు పైబడి జరిగే వ్యాపారం ఈ ఏడాది వంద కోట్లు కూడా జరిగే అవకాశం లేదు. అది కూడా దిగుబడి ఒక్కసారిగా వచ్చే అవకాశం లేదు. ఒక్కో రకం చెట్లు ఒక్కో సమయంలో పూత పూయడంతో ఈ వ్యాపారం ఒక్కసారిగా కాకుండా ఏకంగా నాలుగు నెలల పాటు సాగే అవకాశం ఉంది. డిసెంబరులో పూయాల్సిన పూత నేటికీ కొన్నిచోట్ల పూస్తున్నాయి. కొన్నిచెట్లు పండాయి. కొన్నిచెట్లు పిందె దశలో ఉన్నాయి. అయినా 20 శాతం కూడా పంట పండలేదు. దీనివల్ల ఈ ఏడాది భారీ ఎత్తున మామిడి వ్యాపారం తగ్గిపోనుంది.

పెనుశిల.. శేషాచల సోయగాలు



అందమైన ఘాట్‌రోడ్డు



చిట్వేలి-రాపూరుకు వెళ్లే ఘాట్ రోడ్డు, చూపరులను ఆకట్టుకునే అడవితల్లి అందాలు

- రాపూరు ఘాట్ రోడ్డులో ఆహ్లాదకర వాతావరణం
- వేసవిలోనూ తగ్గని పచ్చదనం

రాజంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య-నెల్లూరు సరిహద్దు అందాలు ప్రతి ఒక్కరినీ అబ్బురపరుస్తున్నాయి. నెల్లూరు వైపు పెనుశిల అభయారణ్యం, అన్నమయ్య వైపు శేషాచల సోయగాలు ప్రయాణికులను కట్టిపడేస్తున్నాయి. ప్రస్తుత వేసవిలోను పచ్చదనం పరుచుకుని ఉంది. లోయలు, కొండలు, రకరకాల చెట్లు, వన్యప్రాణులు, పెద్ద పెద్ద ఘాట్‌మార్గం, ఎన్నెన్నో మలుపులు, ప్రయాణికులకు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. చిట్వేలి నుంచి నెల్లూరు జిల్లా రాపూరుకు 30 కిలోమీటర్లు దూరం. ఇందులో 20 కిలోమీటర్లు ఘాట్‌రోడ్డు మార్గమే ఉంటుంది. పెద్ద పెద్ద లోయలు, చూడచక్కని అందమైన చెట్లు, ఘాట్‌రోడ్ మనుషులను కట్టిపడేస్తున్నాయి. రెండు నెలల వరకు ఈ మార్గంలో అనేక సెలయేర్లు గల గల పారుతూ ఉండేవి. పెనుశిల అభయారణ్యం నుంచి వర్షాకాలంలో పారే నీరు ఇట్టే చూపరునలను కట్టిపడేస్తుంది. ప్రస్తుతం వేసవిలో నీరు తగ్గడం వల్ల జలపాతాల్లో కొద్ది కొద్దిగా మాత్రమే నీరు ఉంది. ఇటువైపున గుండాలేరు, అటువైపున పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కొండల నుంచి పారే నీటితో సెలయేర్లు పారుతూ ప్రయాణికులకు ఎంతో ఆహ్లాదాన్ని ఇచ్చేవి. ప్రకృతి అందాలకు నెలవైన ప్రాంతంలో ఎర్రచందనం లాంటి ఎన్నో విలువైన అనేక రకాల భారీ చెట్లు ఈ మార్గంలో ఉన్నాయి. చిరుతలు, నెమళ్లు, జింకలు, తోడేళ్లు, నక్కలు, కణితులు, ఇలా అనేక రకాల వణ్యప్రాణులన్నీ ఈ ప్రాంతంలో ఉన్నాయి. అప్పుడప్పుడు ప్రయాణికులకు ఇవి కనిపిస్తుంటాయి. ఈ మార్గంలో పదుల కొద్దీ బస్సులు, వందలాది కార్లు, మోటారు సైకిళ్లు ఇతర వాహనాలు వెళుతుంటాయి.



అభయారణ్యంలో ప్రయాణికులను ఆకట్టుకునే జలపాతం (ఫైల్)

కలికిరిలో 15న దేశవాళీ

విత్తనాల పరిరక్షణ సదస్సు

- హాజరు కానున్న సీమ రైతులు

కలికిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దేశవాళీ వంగడాలను పరిరక్షించి, అవసరమైతే బహుళ ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి కేంద్ర వ్యవసాయ శాఖ సన్నాహాలు ప్రారంభించింది. రాయలసీమ జిల్లాల్లో దాదాపు ముప్పై, నలభై ఏళ్ల క్రితం వాడుకలో ఉన్న వరి, వేరుశెనగ, ఉద్యాన పంటలు, పశుగ్రాసం తదితర సంప్రదాయ వంగడాల విత్తనాలను సమీకరించి పరిరక్షించే బాధ్యతలను కలికిరి కృషి విజ్ఞాన కేంద్రానికి అప్పగించింది. ఇందులో భాగంగా ఈ నెల 15న కలికిరిలో రాయలసీమ స్థాయి దేశవాళీ వంగడాలు సాగుచేస్తున్న రైతుల సదస్సు ఏర్పాటు చేసినట్లు కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు.

రాయలసీమలోని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప, నంద్యాల, సత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని దేశవాళీ రకాలను కాపాడుకొస్తున్న రైతులు, రైతు సంఘాలతో ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు కోఆర్డినేటర్ వివరించారు. రైతులు తరతరాలుగా కాపాడుకొస్తున్న దేశవాళీ ఆహార ధాన్యాలు, ఉద్యాన పంటలు (పూలతో సహా), పశుగ్రాసానికి సంబంధించిన విత్తనాలను ఈ సదస్సులో ప్రదర్శించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ జిల్లాల్లోని రైతులు తాము ప్రదర్శించబోయే రకాల గురించి ముందుగానే సమాచారం అందజేసి, పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. దేశవాళీ రకాలను సంరక్షిస్తున్న రైతులకు వివిధ రకాల లబ్ధి చేకూరేందుకు ఈ సదస్సు ద్వారా అవకాశం కలుగుతుందని తెలిపారు. పేర్లు నమోదుకు, లేదా ఇతర వివరాల కోసం కేవీకే కోఆర్డినేటర్‌ను 8008500320 లేదా 9618934777 నంబర్లలోనూ లేదా కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన (పశువైద్య విభాగం 9502888728), డాక్టర్ పీరూసాహెబ్ (సస్యరక్షణ 7989850004), డాక్టర్ ఎ.శ్రీనివాసులు (ఉద్యాన విభాగం 8008724284), డాక్టర్ మాధురి (విస్తరణ విభాగం 6303197399), డాక్టర్ ఎస్.సోమశేఖర్‌బాబు (సేద్య విభాగం 9440500167) లను సంప్రదించాలని కోరారు.

ఎస్జీటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయండి

- కమిషనర్‌ను కోరిన ఎన్‌టీఏ నేతలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కార్పొరేషన్ పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో ఉన్న 120 సెకండరీ గ్రేడ్ పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేయాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ విజయరామరాజుకు ఎన్‌టీఏ నాయకులు వినతిపత్రం సమర్పించారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావు బుధవారం కమిషనర్‌తో మాట్లాడుతూ 2009లో రాష్ట్రంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో ఉన్న సెకండరీ గ్రేడ్ పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేశారని, ఒక్క విజయవాడ కార్పొరేషన్‌లో 120 సెకండరీ గ్రేడ్ పోస్టులను ఇంతవరకు అప్‌గ్రేడ్ చేయలేదన్నారు. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్‌లలోని ఉన్నత పాఠశాలల్లో అప్ గ్రేడ్ అయిన పాఠశాలలకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, అన్ని సబ్జెక్టులకు స్కూల్ అసిస్టెంట్లను మంజూరు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే ప్రస్తుత బదిలీల్లో పదవీ విరమణ వయస్సు మూడు సంవత్సరాలలోపు ఉన్న వారికి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, అలాగే విడాకులు పొందిన మహిళలకు ప్రత్యేక కేటగిరి కింద చూపాలని, 1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయస్సు 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి శ్రీనివాసరావు, వైవీ చిట్టిబాబు, గోవిందు నాగరాజు, కోదండపాణి పాల్గొన్నారు.

అపార్ ఐడీ తప్పనిసరి : డీఈవో

సంబేపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డ్రాపౌట్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ తప్పనిసరిగా ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల పేర్లు డ్రాప్ బాక్స్‌లో ఉంచరాదన్నారు. అలా ఉండే విద్యార్థులను తిరిగి చేర్చుకుని వారితో ఫొటో దిగి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు విద్యార్థుల నమోదు కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో సమ్మిళిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్ జనార్ధన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోదండరాముడి సన్నిధిలో ఎంపీలు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయాన్ని కడప, రాజంపేట ఎంపీలు వేర్వేరుగా వచ్చి సందర్శించారు. ఉదయం కడప పార్లమెంట్ సభ్యుడు అవినాశ్‌రెడ్డి కోదండరామున్ని దర్శించుకున్నారు. మధ్యాహ్నం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గే భాస్కర్‌రెడ్డి, నందకిషోర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోదండరామాలయంలో ఎంపీ మిథున్, ఎమ్మెల్యే ఆకేపాటి

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి

డ్వామా పీడీ వెంకటరత్నం



పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో వేగం పెంచాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరత్నం ఆదేశించారు. బుధవారం రైల్వేకోడూరు మండలంలోని గుండాలపల్లె, ఓబనపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ముమ్మరంగా ఫారంపాండ్స్ పనులు జరుగుతున్నాయన్నారు. ఉపాధిలో అవినీతి రహితంగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని తెలిపారు. పనుల్లో ఎక్కడా అవినీతి లేకుండా చేయాలని అధికారులను సూచించారు. ఫారంపాండ్స్ వల్ల భూగర్భజలాలు పెరుగుతాయని తెలిపారు. అనంతరం అటవీశాఖ నర్సరీలో డ్వామా ద్వారా పెరుగుతున్న మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు ఉపాధి ఏపీవో మృత్యుంజయరావు, అసిస్టెంట్ క్వాలిటీ అధికారి ఉమామహేశ్వర్, అటవీశాఖ డీఆర్‌వో డీపీ గురవయ్య, ఎఫ్‌బీవో ప్రసన్న, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పుల్లంపేటలో భారీ చోరీ

160 గ్రాముల బంగారం, రూ.8 లక్షల నగదు...



ఇంటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ మోహన్‌కుమార్‌గౌడ్

పుల్లంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నాగులమాను వీధిలో నివాసం ఉంటున్న షేక్ మస్తాన్ ఇంటిలో మంగళవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ చోరీలో 160 గ్రాముల బంగారం, 8 లక్షల నగదు, 70 గ్రాములు వెండి మాయమైనట్లు బాధితుడు పుల్లంపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే... బాధితుడు మస్తాన్ గల్ఫ్ ఏజెంటుగా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి రాయచోటికి వెళ్లాడు. బుధవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో పక్కంటిలో నివాసం ఉంటున్న వారు మీ ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి, మీరెక్కడున్నారంటూ ఫోన్లో అడిగారు. దీంతో రాయచోటిలో ఉన్న మస్తాన్ తమ బంధువులను ఇంటి వద్దకు పంపారు. ఇంటిలో చోరీ జరిగిన విషయం తెలుసుకుని వెంటనే రాయచోటి నుంచి పుల్లంపేటకు వచ్చారు. ఇంటిలో చోరీ జరిగిన విషయాన్ని పోలీసుస్టేసన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో రూరల్ సీఐ రమణ, ఎస్‌ఐ మోహన్‌కుమార్‌గౌడ్‌లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. దీనిపై ఎస్‌ఐ మోహన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ చోరీపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం

పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి



అధ్వానంగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న ఎస్ఈ

సుండుపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రోడ్ల సౌకర్యమే లక్ష్యమని పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో బుధవారం మండలంలోని ఆరెమ్మ వీధిలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్డు, కల్వర్టులను ఆయన పరిశీలించారు. అనంతరం చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీలో ప్రధాన రహదారి నుంచి పూజారివాండ్లపల్లెకు తారు రోడ్డు ఏర్పాటుకు పరిశీలించారు. త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. రోడ్ల పనుల్లో రాజీపడకూడదని, నాణ్యమైన రోడ్లను వేయాలని ఆదేశించారు. ఎక్కడెక్కడ రోడ్ల వసతి లేదో ఆరా తీశారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి పల్లెల్లో మట్టి రోడ్లు లేకుండా చేస్తామన్నారు.

కారు, స్కూటర్ ఢీ : యువకుడు మృతి



వరుణ్‌కుమార్‌రెడ్డి మృతదేహం

రామాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారి రామాపురం మండలం బండపల్లి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లగుంట్ల వరుణ్‌కుమార్‌రెడ్డి (23) మృతి చెందినట్లు రామాపురం ఎస్‌ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు... వెంకటరెడ్డిగారిపల్లెకు చెందిన వరుణ్‌కుమార్‌రెడ్డి కరెంటు పనులు చేసేవాడు. పనులు ముగించుకొని రాయచోటి నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా కమలాపురానికి చెందిన మధురమోహన్‌రెడ్డి కారులో రాయచోటికి వస్తూ ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను ఢీకొన్నాడు. ఈ సంఘటనలో వరుణ్‌కుమార్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జాతీయ రహదారిలో పార్కింగ్

సిద్దవటం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్టలో ఈనెల 11న సీతారాముల కల్యాణం సందర్భంగా కడప నుంచి వచ్చే భక్తుల వాహనాలు పెట్టుకోవడానికి పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు తెలిపారు. మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారి సాయినగర్, ఉప్పరపల్లె, మాచవరం, సాయిబాబా టెంపుల్, తదితర ప్రాంతాల్లో 13 పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు మాట్లాడుతూ సీతారాముల కల్యాణం సందర్భంగా కడప నుంచి వచ్చే భక్తులకు వాహనాలు నిలుపుదలకు పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశామని, పార్కింగ్ ప్రదేశాల నుంచి ఉచితంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ కల్యాణం చూసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే పథకాలు

జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రానాయక్

రైల్వేకోడూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని జిల్లా వ్యవసాయశాఖాధికారి బి.చంద్రానాయక్ తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు, పుల్లంపేట, చిట్వేలి, ఓబులవారిపల్లె మండలాలకు చెందిన వ్యవసాయశాఖాధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమాన్ని ఈనెల 15తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు కవిత, రైల్వేకోడూరు మండల వ్యవసాయ శాఖాధికారి జి.సుధాకర్, వ్యవసాయశాఖ టెక్నికల్ అధికారి శ్రీరాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంగంపేట గనులను పరిశీలించిన

ఐబీఎం అధికారులు


ఓబులవారిపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ గనుల శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు సంబంధిత అధికారులతో కలిసి మంగంపేట ఏపీఎండీసీ బ్రాంచ్ పరిధిలో ఉన్న గనులను బుధవారం పరిశీలించారు. మైనింగ్ ప్రక్రియలో భాగంగా బ్లాస్టింగ్, ట్రాన్స్‌పోర్ట్, గ్రేడింగ్‌లను పరిశీలించిన ఇండియన్ బ్యూరో ఆఫ్ మినరల్ అధికారులు మైనర్ మినరల్‌గా ఉన్న మంగంపేట గనులు మేజర్ మినరల్‌గా అధికారులు గుర్తించడంతో అందుకు సంబంధించిన ప్రక్రియను పరిశీలించారు. అలాగే మైనింగ్‌కు సంబంధించి పలు అంశాలపై మంగంపేట ఏపీఎండీసీ అధికారులతో చర్చించారు.

మంటలార్పేదెలా?

- ఫైరింజన్‌లకు నీరు కరువు
- ప్రైవేటు బోర్లే గతి
- 21 ఏళ్లుగా ఇదే పరిస్థితి
- సమస్యల వలయంలో అగ్నిమాపక కేంద్రం

ములకలచెరువు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు భగభగ మండుతున్నాడు. ఎండలు తీవ్రరూపం దాల్చాయి. అగ్ని ప్రమాదాలు జోరందుకున్నాయి. ఈ తరుణంలో మంటలు ఆర్పేందుకు ఫైరింజన్‌కు నీరు కరువైంది. 21 ఏళ్లుగా ఈ పరిస్థితి ఉన్నా ఫైరింజన్‌కు నీటి సమస్య తీర్చే నాథుడే లేడు. చేసేది లేక ప్రైవేటు బోర్ల వద్ద ఫైరింజన్‌కు నీరు పట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అగ్నిమాపక కేంద్రంలో ఏళ్ల తరబడిగా నెలకొన్న సమస్యలు పరిష్కారం కావడం లేదు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి 2004లో ములకలచెరువులోని సింగిల్‌విండో కార్యాలయంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ అగ్నిమాపక కేంద్రం పరిధిలో ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో ప్రతి ఏటా వేసవిలో అత్యధికంగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. అగ్నిప్రమాదాలు జరిగితే ఇక్కడి నుంచి ఫైరింజన్ వెళుతోంది. ఈ క్రమంలో అగ్నిమాపక కేంద్రాన్ని 2007లో మార్కెట్ యార్డులోని ఇరుకైన గదిలోకి మార్చారు. అగ్నిమాపక కేంద్రం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు పక్కాభవనం లేదు. ఫైరింజన్‌కు నీటి వసతి కూడా కల్పించలేదు. ఫైరింజన్‌కు నీరు నింపాలంటే సిబ్బంది ప్రైవేటు బోర్లను ఆశ్రయిస్తున్నారు. ఏళ్ల తరబడిగా ఫైరింజన్‌కు నీటి వసతి లేక అగ్నిమాపక సిబ్బంది పడుతున్న కష్టాలు వర్ణణాతీతంగా మారాయి. ప్రస్తుతం ఓ కల్యాణమండపంలోని బోరులో నీరు నింపుకుంటున్నారు. అలాగే పక్కా భవనం లేక ఇరుకైన గదిలోనే సిబ్బంది ఉండాల్సి వస్తోంది. మొత్తం 14 మంది సిబ్బందికి గానూ ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యంగా ఎనిమిది మంది ఫైర్‌మెన్‌లకు గానూ ఒక్కరే ఉన్నారు. సిబ్బంది కొరతతో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మంటలు ఆర్పేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి అగ్నిమాపక కేంద్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతో పాటు ముఖ్యంగా ఫైరింజన్‌కు నీటి వసతి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

పక్కా భవనానికి నిధులు మంజూరు



ములకలచెరువు అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.25 కోట్లు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ కూడా జరిగింది. భవన నిర్మాణం పూర్తయితే సమస్యలు పరిష్కారమవుతాయి. ఫైరింజన్‌కు నీటి వసతి కూడా కల్పిస్తారు. ఫైరింజన్ కండీషన్ బాగుంది. ఎక్కడైనా అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే సమాచారం ఇవ్వండి.

- నరసింహులు, అగ్నిమాపక అధికారి, ములకలచెరువు

27 రోజుల్లో 24 అగ్నిప్రమాదాలు

మారుమూల ప్రాంతం కావడంతో అగ్నిప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఈనెల 1వతేదీ నుంచి ఇప్పటి వరకు 24 అగ్నిప్రమాదాలు జరిగాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అగ్ని ప్రమాదాల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూనే ఉంది. మారుమూల ప్రాంతాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఫైరింజన్ వెళ్లలేని పరిస్థితి నెలకొంది.



ప్రైవేటు బోరు వద్ద ఫైరింజన్‌కు నీరు పడుతున్న సిబ్బంది (ఫైల్)



మార్కెట్ కమిటీ కార్యాలయంలో అగ్నిమాపక కేంద్రం



ఈ-శ్రమ్.. కార్మికులకు వరం

నమోదులో అధికార యంత్రాంగం కసరత్తు

ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత వలస కార్మికులకు సామాజిక భద్రత కల్పించి.. సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ కార్మికులకు ఓ వరం లాంటింది. ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈ-శ్రమ్‌లో వివరాల నమోదుకు సమీప గ్రామ, వార్డు సచివాలయాలు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌ఈ) కార్మిక శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలి. ఈ పక్రియ పూర్తయ్యాక యూఏఎన్ గుర్తింపు కార్డు జారీ అవుతుంది.

జిల్లాలో మొత్తం 7.50 లక్షల మంది కార్మికుల వివరాలు నమోదు లక్ష్యం కాగా ఇప్పటికి 3,67,933 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ప్రయోజనాలపై కార్మిక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేస్తూ అసంఘటిత కార్మికులకు చేకూరే ప్రయోజనాలను వివరిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

అర్హులైన వారు పేర్లు నమోదు చేసుకుంటే ప్రభుత్వ ప్రయోజనాలు వర్తిస్తాయి. ఈ-శ్రమ్‌లో నమోదు అయితే గుర్తింపు కార్డు అందజేస్తారు. పథకాన్ని అసంఘటిత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి.

- శ్రీకాంత్‌నాయక్, కార్మికశాఖ ఉపకమిషనర్, కడపజిల్లా

వీరంతా అర్హులే

18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అసంఘటిత రంగ కార్మికులు, ఈపీఎఫ్ సభ్యత్వం లేనివారు, ఆదాయ పన్ను పరిధిలోకి రానివారు అర్హులు. ఉపాధి హామీ కూలీలు, మత్స్యకారులు, భవన నిర్మాణ, పారిశుధ్య కార్మికులు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు, వ్యవసాయ, ఉద్యాన, పాడిపరిశ్రమ కూలీలు, కుమ్మరి, స్వర్ణకారులు, ఇతర చేతివృత్తులవారు, సేవా రంగంలో ఉన్నవారు, బిగ్ వర్కర్స్ డొమోటా, స్విగ్గి వంటి (ఫుడ్ డెలివరి కార్మికులు) కార్మికులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందవచ్చు

నమోదు ఉచితం

ఈ-శ్రమ్‌లో వివరాల నమోదుకు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్ పత్రాలు, ఆధార్‌కు అనుసంధానమైన సెల్‌ఫోన్ నంబరు, నామిని ఆధార్ వివరాలు అవసరం. వార్డు సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్, కార్మిక శాఖ కార్యాలయాల్లో సంప్రదిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ పక్రియ పూర్తిగా ఉచితం. ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదు. అంతా అయ్యాక యూఏఎన్ గుర్తింపు కార్డు జారీ అవుతుంది.

ప్రయోజనాలు ఎన్నో...

నమోదు అయిన కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యానికి గురైతే రూ.2 లక్షలు, పాక్షికంగా గాయపడితే రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందుతుంది. వలస కార్మికులకు ఎంతో ఊరటనిచ్చే ప్రయోజనాలు కలుగనున్నాయి. ఈశ్రమ్‌లో నమోదు అయినవారు ప్రభుత్వ వృత్తి నైపుణ్య శిక్షణ ఉపాధి అవకాశాలు పొందవచ్చు.


కార్మికుల వివరాలను రిజిస్టర్ చేస్తున్న లేబర్ ఆఫీసర్ పావని(ఫైల్‌ఫొటో)

ప్రకృతి వ్యవసాయంతో అందరికీ ఆరోగ్యం


బలసింగాయపల్లెలో ప్రకృతి వ్యవసాయంపై మాట్లాడుతున్న డాక్టర్ బలరామ్‌కిషన్

చెన్నూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయన రహిత వ్యవసాయం చేపట్టాలని.. తద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉంటారని మధ్యప్రదేశ్‌కు చెందిన కిసాన్ పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బలరాం కిషన్ అన్నారు. మండలంలోని బలసింగాయపల్లెలో బుధవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలన్న లక్ష్యంతో అన్ని రాష్ట్రాల్లో కిసాన్ పాఠశాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి పంటకు తెగుళ్ల వ్యాపిస్తుంటాయని, రసాయన మందులు ఇష్టానుసారం వాడుతున్నాం కాబట్టి తెగుళ్ల ఆశిస్తున్నాయని తెలిపారు. కషాయాలతో తెగుళ్లను పూర్తిగా నివారించవచ్చన్నారు. అలాగే రైతులు అడిగిన పలు సందేహాలకు ఆయన సమాధానాలిచ్చారు. కాగా, ఆదర్శ రైతు బాలచంద్రుడు బలసింగాయపల్లెలో సాగు చేసిన పసుపు పంటను బలరామకిషన్ రైతులతో కలిసి పరిశీలించారు. అలాగే రసాయనాలతో సాగు చేసిన పసుపు పంట పరిశీలించారు. ఈ రెంటికీ తేడాను రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. ప్రకృతి సేద్యంతో సాగు చేసిన పసుపు రెట్టింపు దిగుబడి వచ్చిందని తెలిపారు. ఏపీసీఎన్‌ఎఫ్ జిల్లా ప్రాజెక్టు అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ వెంకట్రమణ, ఆదర్శ రైతు చదిపిరాళ్ల ప్రసాద్‌రెడ్డి, కొండారెడ్డి, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు విశేష స్పందన


క్యాంపస్ ఇంటర్వ్యూలలో పాల్గొన్న విద్యార్థులతో నారాయణ విద్యాసంస్థల ఏజీఎం, కోఆర్డినేటర్లు తదితరులు

సీకేదిన్నె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): క్యాంపస్ ఇంటర్వ్యూలకు విశేష స్పందన లభించినట్లు కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఎస్‌ఎస్ మూర్తి తెలిపారు. నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బుధవారం కేఎస్‌ఆర్‌ఎం, కేఎల్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. నారాయణ విద్యాసంస్థల రాయలసీమ జోన్ హెచ్‌ఆర్ రిక్రూటర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు మూడు విధాలుగా రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూ చేసి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన కేఎస్‌ఆర్‌ఎం విద్యాసంస్థల ఎండీ చంద్ర ఓబుళ్‌రెడ్డి, పీటీవో ఆఫీసర్స్ నాగరాజు, సిద్ధిక్‌కు నారాయణ విద్యాసంస్థల ఏజీఎం, కోఆర్డినేటర్లు ధన్యవాదాలు తెలిపారు. అధ్యాపకులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.


జగన్‌కు పదవి పోయినా తగ్గని అహంకారం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్


విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా అహంకారం తగ్గలేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మండిపడ్డారు. బుధవారం నగరంలోని హరిటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన ప్రభుత్వంలో పోలీసులను ఇష్టమొచ్చినట్లు వాడుకొని ఇప్పుడు వారిని బట్టలూడదీసి నిలబెడతామనడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. జగన్ హత్యా రాజకీయాల గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. గత ప్రభుత్వంలో జిల్లాలో ఎన్ని హత్యలు జరిగాయో సమాధానం చెప్పాలన్నారు. వ్యవస్థలపై దాడి చేయడం జగన్‌కు అలవాటేనన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు నాగరాజు, గంధం ప్రసాద్, టీడీపీ నాయకులు అమీర్ ఖాసీం పాల్గొన్నారు.

చీనీ తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు


అంకాళమ్మగూడూరులో చీనీ తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సింహాద్రిపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలం లోని బలపనూరు, అంకాళమ్మగూడూరు, హిమకుంట్ల, సుంకేసుల, అహోబిళం గ్రామాల్లో చీనీ తోటలను బుధవారం శాస్త్రవేత్తలు రామకృష్ణ, కె.అరుణోదయం పరిశీలించారు. కొన్ని గ్రామాల్లో చీనీ తోటలకు నీటి తడులు అధికంగా అందించడం, భూమిలో తేమ ఆరకపోవడంలో వేర్లు త్వరగా కుళ్లిపోయి చెట్లు క్షీణిస్తున్నాయని శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. చీనీ చెట్లు దెబ్బతినకుండా ఉండాలంటే నేల స్వభావంను బట్టి ఒక తడికి 60 లీటర్లు మించి నీరు ఇవ్వకూడదన్నారు. వేరుకుళ్ళు కనిపించిన తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపడితే శాశ్వతంగా నివారించుకోవచ్చని రైతులకు వివరించారు. ఉద్యానవనశాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి, వీహెచ్‌ఏలు శ్రీలేఖ, ఉష, దీపిక రైతులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల ఎదుట మార్చి 24వ తేదీ రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బట్టు కిశోర్‌బాబు (33) అనే వ్యక్తి మృతి చెందాడు. అయితే కిశోర్‌బాబు మృతి విషయంలో అనుమానం ఉన్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన విచారణ చేపట్టినట్లుసీఐ లింగప్ప తెలిపారు. మృతుడు కిశోర్‌బాబుకు అన్న వరుస అయిన దేవరపల్లి ఉదయ్‌కుమార్ ప్రొద్దుటూరు టౌన్‌లో మార్చి 20వ తేదీ ఓ కార్యక్రమానికి వెళ్లి అక్కడ వారిద్దరు ఘర్షణ పడినట్లు తెలిపారు. ఆరోజు నుంచి ఎలాగైనా ఆయనను చంపాలని ఉదయ్‌కుమార్ మార్చి 24వ తేదీ జమ్మలమడుగుకు ఏపీ39యూపీ3392 నెంబరు గల ఐచర్ వాహనంలో వచ్చి జమ్మలమడుగులో కిశోర్‌బాబుకు ఫోన్ చేసి నీ అంతు చూస్తానని చెప్పినట్లు విచారణలో తేలిందన్నారు. అదే రోజు రాత్రి ఐచర్ వాహనంలో ద్విచక్ర వాహనాన్ని వెనుకవైపు నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఈ కేసును ఛేదించి నిందితుడు ఉదయ్‌కుమార్ అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

గుంతకల్ రైల్వేడివిజన్‌లో కొత్త రైల్వేలైన్లు నిర్మించాలి

● రైల్వే సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి



పులివెందుల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు డివిజన్‌లో ఉన్న రైల్వేలైన్లే కాకుండా కొత్తగా రైల్వేలైన్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గుంతకల్ రైల్వేడివిజన్ పరిధిలో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సమీక్ష సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ గుంతకల్ రైల్వేడివిజన్‌లో గతంలో పలు స్టేషన్లలో రైళ్లు ఆగుతున్నా వాటిని రద్దు చేయడం జరిగిందన్నారు. అవసరం ఉన్న చోట మళ్లీ స్టాపింగ్‌లను పునరుద్దరించాలన్నారు. ముదనూరు-ముదిగుబ్బ కొత్త రైల్వేలైన్‌ను ఏర్పాటుకు గుంతకల్ డివిజన్ చొరవ చూపాలన్నారు. ఈ రైల్వేలైన్ కేవలం 65కిలోమీటర్లు మాత్రమే నిర్మిస్తే కడప, నంద్యాల జిల్లాల వారిని సత్యసాయి జిల్లాతో అనుసంధానం ఏర్పడుతూ కర్ణాటక రాష్ట్రంతోను అనుసంధానించవచ్చన్నారు. కడప, నంద్యాల ప్రజలకు బెంగుళూరకు పోయేందుకు సరైన రైలు సౌకర్యం లేదన్నారు. ఈ ప్రాంతాల నుంచి ప్రతినిత్యం పారిశ్రామిక ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేయడం సులభతరమ వుతుం దన్నారు. గతంలో హుబ్లీ-తిరుపతిల మధ్య ప్యాసింజర్ రైలు, గుంతకల్-విజయవాడ మధ్య నడిపేవారన్నారు. ఈ రైల్లు పేద లకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవన్నారు. అది రద్దుచేయడం వల్ల ప్రజలు ఇబ్బందిపడుతున్నారన్నారు. కడప-అనంతపురం-రేణిగుంట-రాయచూర్ రైల్వేస్టేషన్లలో మొన్నటి వరకు ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు రిజర్వేషన్ టికెట్ ఇచ్చేవారన్నారు. కానీ ఉన్నఫలంగా రిజర్వేషన్ సమయాన్ని కుదించి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8గంటల వరకు మాత్రమే రిజర్వేషన్ కౌంటర్లను తెరుస్తున్నారన్నారు. ఇది ప్రయాణికులకు ఇబ్బందిగా ఉందన్నారు. ఇక ధర్మవరం-మచిలీపట్నం రైళ్లను కొండాపురంలో ఆపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. హరిప్రియ ఎక్స్‌ప్రెస్, గోవా-తిరుపతి ఎక్స్‌ప్రెస్, చెంగల్‌పట్టు ఎక్స్‌ప్రెస్, ఎంజీబీ చెన్నై సెంట్రల్ సూపర్‌ఫాస్ట్‌రైళ్లను రైల్వేకోడూరులో స్టాపింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.



రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ ఫ్లాట్‌ఫారం వద్ద బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. సుమారు 45 సంవత్సరాల వయసున్న మృతుడు ఎరుపు ఆకుపచ్చ తెలుపు కలిగిన చొక్కా ధరించి.. ఎడమకాలు మడిమ వద్ద కట్టు కట్టుకొని ఉన్నాడు. వివరాలు తెలిస్తే 9440627658 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు తెలిపారు.

మట్కా బీటర్లు అరెస్టు

జమ్మలమడుగు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో బుధవారం మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఉమ్మడిశెట్టి ఆదిలక్ష్మి, మేషా స్వరూప, గుర్రం చిన్నచెన్నయ్య మట్కా నిర్వహిస్తుండగా అరెస్టు చేసి, వారి వద్ద నుంచి మట్కా పట్టీలతో పాటు రూ.26,050 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చాపాడు ఎస్‌ఐపై ఎస్పీకి ఫిర్యాదు

చాపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చాపాడు మండల ఎస్‌ఐ చిన్నపెద్దయ్యపై ఎస్పీ అశోక్‌కుమార్‌కు ఈనెల 7వ తేదీన సోమవారం ఫిర్యాదు చేసినట్లు నాగులపల్లె గ్రామానికి చెందిన సానా నరసింహారెడ్డి తెలిపారు. తన కుమారుడు విద్యాసాగర్‌రెడ్డిపై ఎస్‌ఐ, ట్రైనింగ్ డీఎస్పీ భవానీ వేదిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 29.09.2024వ తేదీ విద్యాసాగర్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డిని కారుతో ఢీకొట్టినట్లు హత్యాయత్నం కేసు నమోదు చేశారన్నారు. ఈ విషయమై అప్పట్లో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి వారు ఫిర్యాదును తీసుకోలేదన్నారు. హైకోర్టులో పిటీషన్ వేయగా కోర్టు ఫిర్యాదును స్వీకరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు మళ్లీ ఎస్పీ, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌కు ఇటీవల అర్జీలు ఇచ్చినట్లు తెలిపారు. ఈనెల 3వ తేదీ చాపాడు పోలీసు స్టేషన్‌లో ట్రైనింగ్ పొందుతున్న డీఎస్పీ భవానీ తన కుమారుడు విద్యాసాగర్ రెడ్డిని పోలీసు స్టేషన్‌కు పిలిపించుకుని బైండోవర్ కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ, భవానీ బెదిరించినట్లు వారు ఆరోపించారు. ఎస్‌ఐపై విచారణ జరపాలని కోరామన్నారు.

ఈ విషయమై ఎస్‌ఐ చిన్నపెద్దయ్యను ఫోన్‌లో వివరణ అడుగగా సానా నరసింహారెడ్డిని కానీ, ఆయన కుమారుడు విద్యాసాగర్‌రెడ్డిని కానీ బెదిరించలేదన్నారు. చట్ట ప్రకారమే వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

కడప జలవనరుల శాఖ డీఈఈ ధనంజయులుకు ఊరట

కలికిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో కడప ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్-1 డివిజన్ డీఈఈ ధనంజయులుకు ఊరట దక్కింది. ఆయనపై నమోదైన కొన్ని అభియోగాల నుంచి ఆయనకు విముక్తి కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సోమశిల ప్రాజెక్టు కోసం భూములు సేకరించే క్రమంలో జిల్లాలోని అట్లూరు మండలం ముత్తుకూరు గ్రామంలోని చౌటపల్లెలోని సర్వే నంబర్లు 15, 16/1, 19/3లోని భూములను పరిశీలించడంలో తప్పుడు నివేదికలను పంపిన కారణంగా ఆయనపై అభియోగాలు నమోదు చేసి 2024 మార్చి 4న సంజాయిషీలు కోరారు. అదే నెల 27న ఒకసారి, జూన్ 10న మరోసారి ధనంజయులు తన వివరణలను సమర్పించారు. తన తనిఖీల సమయంలో భారీ వరదల కారణంగా తాను నైపుణ్యంలేని కూలీలతో పనులు చేయించాల్సి వచ్చిన కారణంగా కొన్ని మానవ తప్పిదాలు జరిగినట్లు అంగీకరించారు. ధనుంజయులు సమర్పించిన సంజాయిషీలపై ప్రభుత్వం కడప ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్ఈని విచారణాధికారిగా నియమించింది. ఆయన అందజేసిన విచారణా నివేదికను పరిశీలించిన ప్రభుత్వం ధనుంజయులుపై తదుపరి చర్యలను ఉపసంహరిస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

ప్రొద్దుటూరు కోర్టుకు ఏపీపీ నియామకం

కలికిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. న్యాయవాది మార్తాల సుధాకర్ రెడ్డిని ఏపీపీగా నియమించారు. నెలకు రూ.40 వేల గౌరవ వేతనంతో మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారని పేర్కొంటూ రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు.

పాఠశాలల ప్రారంభ సమయానికి విద్యార్థి కిట్టు అందజేయాలి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రారంభం సమయానికి విద్యార్థి కిట్టు అందించాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం వేసవి సెలవుల్లోని విద్యార్థి కిట్టులోని అన్నిరకాల సామాగ్రిని జిల్లా, మండల, స్కూల్ పాయింట్‌కుచేరేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సర్వేపల్లె రాధాకృష్ణ విద్యార్థి మిత్ర రాష్ట్ర అబ్జర్వర్ వీవీకే ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం వైఎస్సార్ జిల్లాలోని ఒంటిమిట్ట, సిద్దవటం, చింతకొమ్మదిన్నె, చెన్నూరు, ఖాజీపేట, కడప మండలాలస్టాక్ పాయింట్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్టాక్ పాయింట్లలో స్టాక్ భద్రపరిచే సమయంలో ఎటువంటి ఇబ్బందికి కలగకుండా ప్రదేశాలను చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లాసమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ కోఆర్డినేటర్ దశరథరామ్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి-2 షేక్ ఇర్షాద్ అహ్మద్, మండల కమిటీ సభ్యులు దేవ సహాయం, సాగర్, మండల వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కుందూలో జలకళ

రాజుపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది సకాలంలో వర్షాలు లేక ఏప్రిల్ మాసంలో కుందూనది పూర్తిగా ఎండిపోయింది. అయితే ఈ సంవత్సరం సకా లంలో వర్షాలు పడడంతో కుందూలో నీళ్ల ప్రవహి స్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుందూ నది పరివాహకం వెంబడి ఉన్న పొలాల్లో పూలతోటలు, వరి, నూగు, కొర్ర పంటలు సాగు చేశారు. ఈ పంటలకు పుష్కలంగా నీళ్ల అందుతుండటంతో కళకళలాడుతున్నాయి. అదే విధంగా పశువుల దాహార్తి తీర్చేందుకు కుందూ నీరు ఉపయోగపడుతోంది. ఏది ఏమైనా ఏప్రిల్, మే మాసంలో నదిలో నీటి ప్రవాహం ఉండటంతో తరువాత వర్షాలు పడేంత వరకు ఇబ్బంది ఉండదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థుల భవిష్యత్తు ప్రధానలక్ష్యం కావాలి

కడప ఎడ్యుకేషన్,ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు ప్రధాన లక్ష్యం కావాలని వైవీయు వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో ఆయన శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. జాతీయ విద్యావిధానం-2020ని ప్రకారం విద్యార్థుల సంపూర్ణ ప్రగతికి విశ్వవిద్యాలయంలోని శాఖల ఆలోచనలు, భవిష్యత్తు ప్రణాళికలు స్టడీ చేసేందుకు ఆయన పలు విభాగాలను సందర్శించారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ పి.సరిత, కామర్స్ సహ ఆచార్యులు డాక్టర్ విజయభారతి, ఎంసీఏ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ రెడ్డయ్య పవర్ పాయింట్ ప్రజెటేషన్ ద్వారా వారి వారి విభాగాల అభివృద్ధి గురించి వివరించారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ నైపుణ్య కేంద్రాలు, విద్యా ప్రయోగశాలలు, పరిశోధన ల్యాబ్‌ల కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను సృష్టించేందుకు పరిశ్రమలు, సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

మాతాశిశు మరణాలపై వైద్యులు దృష్టి సారించాలి

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): మాతా శిశు మరణాలపై వైద్యులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రధాన మంత్రి సురక్ష మాతృ అభియాన్ కార్యక్రమ అధికారి డాక్టర్ ప్రియాంక పేర్కొన్నారు. బుధవారం దేవళంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భవతులకు పరీక్షలు నిర్వహించారు. గర్భందాల్చిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేరు నమోదు చేసుకొని నెల నెలా డాక్టర్లు అందిస్తున్న సలహాలు, సూచనలు పాటించాలన్నారు. తరచూ బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భవతులు తప్పనిసరిగా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆకుకూరలు, పాలు, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవళంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి నజ్రియా, మహరాజ్ డాక్టర్ సుమలత, ఎంపీహెచ్ఈవో దేవదానం, సూపర్‌వైజర్లు సురేందర్ రెడ్డి, మనీ, ఏఎన్ఎంలుపాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

నందలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం దాదాప 46 మంది గర్భవతులను వైద్యాధికారులు డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాధ్‌లు పరీక్షలు చేయగా గర్భవతులను డాక్టర్ మస్తానమ్మ, గైనకాలజిస్టు స్కానింగ్ చేసి తగు సూచనలు ఇచ్చారు. సూపర్‌వైజర్ సునీల్, సీహెచ్‌ఎస్ శైలజా, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాయల్ సేవాసమితి సభ్యుల ఆధ్వర్యంలో గర్భిణులకు ఆశా కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేశారు. రాయల్‌సేవా సమితి అధ్యక్షులు శ్రీనివాస్ వారి బృందాన్ని వైద్యులు, ప్రజలు అభినందించారు.

మహాసభలను జయప్రదం చేద్దాం

● ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్

రాయచోటిటౌన్,ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి జక్కుల వెంకటేశ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన రాయచోటి పట్టణంలోని శ్రీనివాస ఐటీఐ కళాశాలలో ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 15 నుంచి 18 వరకు తిరుపతిలో మొట్టమొదటి సారిగా జా తీయ మహాసభలు జరగబోతున్నాయన్నారు. దేశంలోని 29 రాష్ట్రాల నుంచి యువజన సమాఖ్య ప్రతినిధులు వస్తున్నారని, నిరుద్యోగం, అశాంతి, ప్రాంతీయత, మతతత్వ విధానాలు, జాతీయ విద్యా విధానం, ఉపాధి తదితర అంశాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తారన్నారు. విద్య, వైద్యం, కార్మిక సమస్యలు, నిరుద్యోగం, నిత్యావసర సరుకుల ధరల పెంపు తదితర సమస్యల పరిష్కారానికి చర్చిస్తారని, విద్యార్థులు, యువకులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు.

జాతీయ మానవ హక్కుల మండలి లీగల్‌సెల్ అదనపు కార్యదర్శిగా ధీరజ్



తోట శ్రీనివాస ధీరజ్

రాజంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మానవ హక్కుల మండలి లీగల్‌సెల్ రాష్ట్ర అదనపు కార్యదర్శిగా హైకోర్టు న్యాయవాది, బీజేపీ జిల్లా కార్యదర్శి తోట శ్రీనివాస ధీరజ్‌ను నియమిస్తున్నట్లు ఎన్‌హెచ్‌ఆర్‌సీ జాతీయ చైర్మన్ డాక్టర్ సంపత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా తోట ధీరజ్ మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో రాజకీయ కక్షల వల్ల మానవ హక్కుల ఉల్లంఘన శాతం రోజు రోజుకు పడిపోతుందన్నారు. మానవహక్కుల కోసం కృషి చేస్తానన్నారు. తనను ఎన్నుకున్నందుకు చైర్మన్ సంపత్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నిత్యావసరాల వితరణ

రాజంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : డీబీఎస్‌పల్లె దళితవాడకు చెందిన దివ్యాంగుడు కుల్లూరు నరసింహులు మృతిచెందడంతో బుధవారం ఆయన కుటుంబానికి పుల్లంపేట మండల విభిన్న ప్రతిభావంతుల సమైఖ్య సేవా సంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి ఆధ్వర్యంలో మల్లోరుపల్లెకు చెందిన నాగిరెడ్డి సుబ్బారెడి సహకారంతో రెండు ప్యాకెట్లు బియ్యం, నిత్యావసర సరకులు అందజేశారు. డీబీఎస్‌పల్లె గ్రామ పెద్దలు టి.హరి క్రిష్ణ, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

● రాజంపేట మున్సిపాలిటీకి 6 చెత్త సేకరణ ఆటోలు ● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ఆటోలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో మంత్రి రాజంపేట మున్సిపాలిటీకి సీఎస్ఆర్ నిధులు రూ.21 లక్షలతో కొనుగోలు చేసిన 6 చెత్త సేకరణ ఆటోలను కలెక్టర్ చామకూరి శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌ల సమక్షంలో రాజంపేట మున్సిపల్ కమిషనర్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చెత్తసేకరణకు సంబంధించి గతంలో ప్రతి ఇంటి నుంచి డబ్బు వసూలు చేసేవారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎవరి దగ్గర ఒక పైసా కూడా తీసుకోవడం లేదన్నారు. ఈ సందర్భంగా మంత్రితో పాటు కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఆకేపాటి విక్రమ్‌రెడ్డి, జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్‌లు ఆటోలను జెండా ఊపి ప్రారంభించారు.

సమస్యల రహిత సమాజం కోసం కృషి

చిన్నమండెం, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాను సమస్యల రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజా దర్బార్ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అరాచకాలు, అక్రమాలు, భూదోపిడీలతో ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల కాలంలోనే ప్రజల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి బాధితుల సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. బాధితుల అర్జీలను స్వీకరించి వారి సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు.

రామాలయంలో మంత్రి పూజలు

రాయచోటిటౌన్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): రాయచోటి మండల పరిధిలోని శిబ్యాల గ్రామం పాత అనుంపల్లి రామాలయంలో బుధవారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి మండలం మాజీ ఉపాధ్యక్షుడు అనుంపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆహ్వానం మేరకు గ్రామానికి వెళ్లిన మంత్రి మండిపల్లికి గ్రామస్థులు బాణసంచా, బ్యాండు మేళాలతో ఘ నంగా స్వాగతం పలికారు.

చౌడేశ్వరి జ్యోతి ఉత్సవాల్లో...

చిన్నమండెం, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): చిన్నమండెం మండలం దేవగుడిపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన శ్రీచౌడేశ్వరిదేవి ఉత్సవాల్లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పాల్గొని శ్రీచౌడేశ్వరి జ్యోతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీచౌడేశ్వరి జ్యోతి ఆలయ కమిటీ సభ్యులు మంత్రికి పూలమాల వేసి ఘనస్వాగతం పలికారు.

బ్యాంకు ఖాతాల వినియోగంపై అవగాహన

సుండుపల్లె, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి):ప్రతి ఒక్కరూ బ్యాంకు ఖాతాల నిర్వహణ పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీపీ రాజమ్మ, రాయచోటి ఎన్జీవో ఆర్‌హెచ్‌జీబీఎంఎస్ఎస్ ప్రధాన కార్యదర్శి బీవీ రత్నం పేర్కొన్నారు. రిజర్వు బ్యాంకు సహకారంతో బుధవారం సుండుపల్లె ఎంపీడీవో కార్యాలయంలో ఈ అవగాహన సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి ఖాతాకు నామినీని నమోదు చేయాలని, సైబర్ నేరాలకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మస్తాన్

సుండుపల్లె, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మస్తాన్ నియమితులయ్యారు. బుధవారం 20 మంది మైనార్టీ నాయకులు వైసీపీని వీడి సయ్యద్ మస్తాన్‌తో పాటు కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు ఆ పార్టీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు గాజుల భాస్కర్ బుధవారం పేర్కొన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుండుపల్లె మండలానికి చెందిన మస్తాన్‌ను నియమించామన్నారు. మస్తాన్ మాట్లాడుతూ పార్టీలో క్రియాశీలక పదవి కేటాయించినందుకు పార్టీ జిల్లా, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు షేక్. సల్మాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు హసన్‌ఖాన్, వెంకటేశ్‌ఆచారి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

● ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా చైర్మన్ ముక్కా

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రైల్వేకోడూరు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. బుధవారం మండలంలోని రాఘవరాజుపురం, కే.బుడుగుంటపల్లి, శెట్టిగుంట గ్రామ పంచాయతీలలో నూతనంగా నిర్మించిన సచివాలయాలను కుడా చైర్మన్, టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 9 నెలల్లోనే నియోజకవర్గంలో అనేక అభివద్ధి పనులను చేపట్టామని, ప్రజలకు వివిధ సంక్షేమ పథకాలను అందించామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రజలందరూ లబ్ధి పొందాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని ముక్కావారిపల్లె పంచాయతీ పరిధిలో ఉన్న సీఎం.బలిజపల్లెలో అంగన్వాడీ కేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రీధర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. టీడీపీ ఇన్‌చార్జి, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఎంపీడీవో మల్‌రెడ్డి, సర్పంచ్, మండల టీడీపీ నాయకులు పున్నాటి వాసుదేవరెడ్డి, సర్పంచ్ రవిశంకర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి: ఎమ్మెల్యే

పెనగలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : పెనగలూరు మండలం సర్వతోముఖాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రభుత్వవిప్, రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ అన్నారు. అభివృద్ధి కార్యక్రమాలకు, పార్టీలకతీతంగా స్థానిక ప్రజాప్రతినిధులు సహకారం అందించాలని కోరారు. బుధవారం మండల పరిషత్ సభాభవనంలో ఎంపీపీ కొండూరు సౌందర్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎమ్మెల్యే శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ దళితవాడలకు అనుసంధానంగా ఉన్న శ్మశానాలకు ప్రభుత్వం ప్రహరీలను నిర్మిస్తుందన్నారు. ఉపాధి పనుల్లో అవినీతి తగ్గడంలేదని, గత వారం కూడా కట్టవారిపల్లెలో 2 మస్టర్లలో పనికి హాజరుకాని వారి పేర్లను పనికి వచ్చినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ మ స్టర్ తయారు చేశారని కట్టవారిపల్లె ఎంపీటీసీ శ్రీనివాసులునాయుడు తెలిపారు. సొం త జాగా ఉంటే పొజిషన్ సర్టిఫికెట్ తానే ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీలు కొండూరు విజయ్‌రెడ్డి, బి.రోశయ్య, జడ్పీటీసీ యాపీ సుబ్బరాయుడు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు బుధవారం తమ సమస్యలను ఎమ్మెల్యే శ్రీధర్ దృష్టికి తెచ్చారు. డీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసరెడ్డి, కొప్పోలు విజయభాస్కర్ రెడ్డిల సహకారంతో ముండ్లవారిపల్లె తళితవాడకు రాజంపేట - చిట్వేలి రహదారి క్రాస్‌రోడ్డు నుంచి సిమెంటు రోడ్డు నిర్మించాలని కోరారు. అర్హులైనవారికి సాగు భూమి ఇప్పించాలని అన్నారు.

కోదండరాముని దర్శించుకున్న కడప ఎమ్మెల్యే మాధవి



కోదండరాముని సన్నిధిలో కడప ఎమ్మెల్యే మాధవి

ఒంటిమిట్ట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామాలయాన్ని కడప శాసనసభ్యురాలు మాధవి సందర్శించారు. ఈమెతో పాటు తెలుగుదేశంపార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. వీరు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణవేదిక ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర అధికారి ప్రతినిధి మేడా విజయశేఖర్‌రెడ్డి, మండల నాయకులు వినోద్‌రెడ్డి, రఘురామిరెడ్డి, దిలీప్, నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతి సర్పంచ్ జంబు సూర్యనారాయణ, నాయకులు బుజ్జి నల్లగుండు, వెంకటసుబ్బారెడ్డి, పిడుగు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

నూతన కోదండరాముని ఆలయం ప్రారంభం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుపల్లె గ్రామ పరిధిలోని గిరిజనకాలనీలో బుధవారం అనంతరాజుపేట సర్పంచ్ కుశెట్టి సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ సభ్యురాలు పోలెంకోట రత్నమ్మ, ఎంపీటీసీ సభ్యులు బండారు మల్లికార్జునలు ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆలయం లో శ్రీరామనవమి వేడుకల పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో పంజం వేణుగోపాల్‌రెడ్డి, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

రామాపురం, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి, పంట నాణ్యత ఉంటుందని మోడల్ మేకర్ సదాశివరెడ్డి అన్నారు. బుధవారం రామాపురం మండలం నల్లగుట్టపల్లి గ్రామం కొత్తపల్లిలో రైతు సూరం రాఘవరెడ్డి ఒక ఎకరా పొలంలో 30 రకాల ఇత్తనాలను బీజామృతంతో విత్తనశుద్ధి చేసి ఘనజీవామృతం భూమిలో వేయించి భూమిలో విత్తనాలను చల్లించామన్నారు. అగ్రికల్చర్ ఏఈవో కవిత, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సూరం శ్రీదేవి, చప్పిడి రమణ, బంక రమణ, ప్రవళ్లిక, రైతులు పాల్గొన్నారు.

త్వరలో రూ.76 లక్షలతో టెండర్లు: ఎస్ఈ

సుండుపల్లె, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): సుండుపల్లె మండలంలో త్వరలో రూ. 76 లక్షలతో టెండర్లు పిలువనున్నట్లు ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. బుధవారం పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా జీకేరాచపల్లిలో ఉన్న బాలుర, బాలికల వసతి గృహాలను ఆయన తనిఖీ చేశారు. రెండు వసతి గృహాల మరమ్మతులకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ఇందుకు ప్రభుత్వ అనుమతులు వచ్చాయన్నారు. బాలుర వసతి గృహం మరమ్మతులకు రూ.49 లక్షలు, బాలికల వసతి గృహం మరమ్మతులకు రూ.27 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. త్వరలో ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభిస్తామన్నారు. బాలుర వసతి గృహం కొన్ని గదులకు కొత్తగా స్లాబ్ వేయాల్సి వస్తుందన్నారు.

వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

వీరబల్లి, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వంగిమళ్ల పంచాయతీ పుల్లగూరగండిలో నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆలయ నిర్మాణ దాతలు హరినాథరెడ్డి, నాగూర్‌రెడ్డి పూజల్లో పాల్గొన్నారు. ఉత్సవాలకు హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి సీవీ నాగార్జునరెడ్డి దంపతులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలికి సత్కారం



వృద్ధురాలిని సత్కరిస్తున్న దృశ్యం

నందలూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కుర్రా మణియాదవ్ తల్లి, శతాధిక వృద్ధురాలు కుర్రా వెంకటసుబ్బమ్మకు ఎస్ఐ మన్నెం రామ్మోహన్ అధ్యక్షతన వాకర్స్‌క్లబ్ ప్రెసిడెంట్ మోడపోతుల రాము ఆధ్వర్యంలో అరవపల్లె కృష్ణమందిరంలో బుధవారం సత్కార చేశారు. ఈ సందర్భంగా మన్నెం రామ్మోహన్ మాట్లాడుతూ వెంకటసుబ్బమ్మ జీవితాంతం ఆయురారోగ్యాలతో జీవించాలని కోరారు. నందలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దాసరి నరసింహులు మాట్లాడుతూ వెంకటమ్మ ఆనందమయ జీవితం గడపాలన్నారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

సుండుపల్లె, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని పెద్దమాదిగపల్లిలో ఉపాధ్యాయులతో కలిసి ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ బడిలో విద్యార్థుల సంఖ్యను పెంచడానికి ఈ ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు.

బీజేపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేద్దాం : సాయిలోకేశ్



సమావేశంలో మాట్లాడుతున్న సాయిలోకేశ్

రాజంపేట టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : బీజేపీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేద్దాం అని రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు సాయిలోకేశ్ అన్నారు. బుధవారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో క్రియాశీల సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ సంస్థాగత ఎన్నికల విజయాల్లో రాజకీయ పురోగతి సాధించాలన్నారు. వికసిత్ భారత్ వైపు అడుగులు వేద్దామన్నారు. వీటన్నిటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని బీజేపీ పార్టీ దేశ భవిష్యత్‌కు ఏవిధంగా ఉపయోగపడుతుందో వివరించాలన్నారు.బీజేపీ నేతలు పోతుగుంట రమేష్‌నాయుడు,రామజగదీష్ స్వామి, డాక్టర్ అరిగె రాంప్రసాద్, ఆనంద గజపతిరాజు, కృష్ణయాదవ్, మస్తానయ్య, సునీత, నారాయణవర్మ, మొగరాజు రమణయ్య, లింగం ప్రభాకర్, నరేంద్రరాజు,శ్రీనివాస ధీరజ్, మండల అధ్యక్షుడు ప్రసాద్ రెడ్డి, చుక్కా శ్రీనివాసులు, అనంతరాజు, రమణగౌడ్, భానుప్రకాష్‌రాజు పాల్గొన్నారు.

ప్రతి కార్యకర్తా ముందుకు రావాలి

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బీజేపీ బలోపేతం కోసం నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తా ముందుకు రావాలని జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన క్రియాశీల సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ గడ్డం చెంగల్ రాజు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్ నాయుడు, పులపత్తూరి రామసుబ్బారెడ్డి, గాదెల శ్రీనివాసులు, ఐదు మండలాల అధ్యక్షులు, క్రియాశీలక సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం: ఏఐటీయూసీ

రాయచోటి టౌన్,ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమిద్దాం అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ పిలుపునిచ్చారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్మికుల శ్రమను దోచుకోవడమే ధ్యేయంగా పరిపాలన సాగిస్తోందన్నారు. మేడే పోరాట స్ఫూర్తితో కార్మిక వర్గం పోరాటాల ద్వారా బీజేపీ విధానాలను అడ్డుకోవాలన్నారు. బీజేపీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ కార్పొరేట్ శక్తులకు అప్పగించడానికి పెద్ద కుట్రలు చేస్తోందన్నారు. రైల్వే, రక్షణ, విద్యుత్, పబ్లిక్ సర్వీస్‌లను ప్రైవేటుపరం చేయాలనే ఆలోచనను తీవ్రతరం చేస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా కార్మికులు, ప్రజలు తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను తగ్గించడంలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.




12, 13 తేదీల్లో అసర్ల గంగమ్మ జాతర

గాలివీడు, ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నడింపల్లి బలిజపల్లి సరిహద్దు ప్రాంతంలో పవిత్ర కుషావతి నదీ తీరాన వెలిసిన శ్రీఅసర్ల గంగమ్మ తల్లి తిరుణాల మహోత్సవం ఈ నెల 12, 13వ తేదీల్లో నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ 12వ తేదీ శనివారం సిద్దలకూడు నైవేద్యంతో తిరునాళ్ల మహోత్సవానికి అంకురార్పణ చేస్తామన్నారు. అదేరోజు చాందినీ బండ్ల గ్రామోత్సవం, చెక్కభజనలు, కోలాటాలు, బాణసంచా, డప్పు వాయిద్యాల మధ్య భక్తజన సందోహంతో నిండు తిరునాళ్లగా మారుతుందన్నారు. 13వ తేదీ ఉదయం బోనాలు, అసాధుని కథతో తిరునాళ్లు ముగుస్తుందన్నారు.

మార్క్ శంకర్ పవనోవిచ్ త్వరగా కోలుకోవాలని పూజలు

రాయచోటిటౌన్,ఏప్రిల్9(ఆంధ్రజ్యోతి): సింగపూర్‌లో అగ్ని ప్రమాదానికి గురైన ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిన్నకుమారుడు మార్క్ శంకర్ పవనోవిచ్ త్వరగా కోలుకోవాలని పట్టణంలోని గ్రూపు థియేటర్ దగ్గర వెలిసిన ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో బుడ్డా నాగభూషణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 101 కొబ్బరికాయలు కొట్టారు. ఈ కార్యక్రమానికి అన్నమయ్య జిల్లా జనసేన వీర మహిళ రెడ్డిఆణి అతిథిగా హాజరయ్యారు. జనసేన నాయకులు రామాశ్రీనివాస్, జయరాంచిన్నారి, పవన్, బుల్లెట్ విజయ్, బుడ్డా శివాజీ, ప్రదీప్, వెంకటేశ్, శ్రీకాంత్, వీరేంద్ర, నరసింహులు, పగడాల రాజేశ్, రెడ్డిప్రసాద్, కృష్ణ, ప్రవీణ్, నరేశ్‌తో పాటు జనసైనికులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే ప్రజల్లో గుర్తింపు



తిమ్మారెడ్డి దంపతులను సన్మానిస్తున్న రెవెన్యూ అధికారులు

రాయచోటిటౌన్, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగికి ఉత్తమ సేవలతోనే ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని లక్కిరెడ్డిపల్లె ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన మండిపల్లి వెంకటశివ తిమ్మారెడ్డి సేవలు ఎనలేనివన్నారు. బుధవారం రాయచోటి పట్టణంలోని సుధా కల్యాణ మండపంలో తిమ్మారెడ్డి పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డీఎస్‌వో రఘురామ్, జెడ్పీ మాజీ వైస్ చైర్మెన్ దేవనాథరెడ్డి, గాలివీడు వైస్ ఎంపీపీ మిట్టపల్లి యదుభూషణ్‌రెడ్డి, రాయచోటి ఇన్‌చార్జి తహసీల్దార్ నరసింహకుమార్, లక్కిరెడ్డిపల్లె తహసీల్దార్ శ్రీనివాసులు, రామాపురం తహసీల్దార్ రామాంజులు, ఎంఈవోలు శ్రీనివాసులు, శివానాయక్, ఆంజనేయులునాయుడు, రవీంద్రారెడ్డి, ఉపాధ్యాయ సంఘాల నేతలు పీసీ రెడ్డెన్న, అంకం శివారెడ్డి, ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, రెవెన్యూ, పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘాల నేతలు తదితరులు హాజరయ్యారు.

పెనుశిల.. శేషాచల సోయగాలు



అందమైన ఘాట్‌రోడ్డు





చిట్వేలి-రాపూరుకు వెళ్లే ఘాట్ రోడ్డు, చూపరులను ఆకట్టుకునే అడవితల్లి అందాలు

- రాపూరు ఘాట్ రోడ్డులో ఆహ్లాదకర వాతావరణం
- వేసవిలోనూ తగ్గని పచ్చదనం

రాజంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : అన్నమయ్య-నెల్లూరు సరిహద్దు అందాలు ప్రతి ఒక్కరినీ అబ్బురపరుస్తున్నాయి. నెల్లూరు వైపు పెనుశిల అభయారణ్యం, అన్నమయ్య వైపు శేషాచల సోయగాలు ప్రయాణికులను కట్టిపడేస్తున్నాయి. ప్రస్తుత వేసవిలోను పచ్చదనం పరుచుకుని ఉంది. లోయలు, కొండలు, రకరకాల చెట్లు, వన్యప్రాణులు, పెద్ద పెద్ద ఘాట్‌మార్గం, ఎన్నెన్నో మలుపులు, ప్రయాణికులకు ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి. చిట్వేలి నుంచి నెల్లూరు జిల్లా రాపూరుకు 30 కిలోమీటర్లు దూరం. ఇందులో 20 కిలోమీటర్లు ఘాట్‌రోడ్డు మార్గమే ఉంటుంది. పెద్ద పెద్ద లోయలు, చూడచక్కని అందమైన చెట్లు, ఘాట్‌రోడ్ మనుషులను కట్టిపడేస్తున్నాయి. రెండు నెలల వరకు ఈ మార్గంలో అనేక సెలయేర్లు గల గల పారుతూ ఉండేవి. పెనుశిల అభయారణ్యం నుంచి వర్షాకాలంలో పారే నీరు ఇట్టే చూపరునలను కట్టిపడేస్తుంది. ప్రస్తుతం వేసవిలో నీరు తగ్గడం వల్ల జలపాతాల్లో కొద్ది కొద్దిగా మాత్రమే నీరు ఉంది. ఇటువైపున గుండాలేరు, అటువైపున పెనుశిల లక్ష్మీనరసింహస్వామి కొండల నుంచి పారే నీటితో సెలయేర్లు పారుతూ ప్రయాణికులకు ఎంతో ఆహ్లాదాన్ని ఇచ్చేవి. ప్రకృతి అందాలకు నెలవైన ప్రాంతంలో ఎర్రచందనం లాంటి ఎన్నో విలువైన అనేక రకాల భారీ చెట్లు ఈ మార్గంలో ఉన్నాయి. చిరుతలు, నెమళ్లు, జింకలు, తోడేళ్లు, నక్కలు, కణితులు, ఇలా అనేక రకాల వణ్యప్రాణులన్నీ ఈ ప్రాంతంలో ఉన్నాయి. అప్పుడప్పుడు ప్రయాణికులకు ఇవి కనిపిస్తుంటాయి. ఈ మార్గంలో పదుల కొద్దీ బస్సులు, వందలాది కార్లు, మోటారు సైకిళ్లు ఇతర వాహనాలు వెళుతుంటాయి.



అభయారణ్యంలో ప్రయాణికులను ఆకట్టుకునే జలపాతం (ఫైల్)

కలికిరిలో 15న దేశవాళీ

విత్తనాల పరిరక్షణ సదస్సు

- హాజరు కానున్న సీమ రైతులు

కలికిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): దేశవాళీ వంగడాలను పరిరక్షించి, అవసరమైతే బహుళ ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి కేంద్ర వ్యవసాయ శాఖ సన్నాహాలు ప్రారంభించింది. రాయలసీమ జిల్లాల్లో దాదాపు ముప్పై, నలభై ఏళ్ళ క్రితం వాడుకలో ఉన్న వరి, వేరుశెనగ, ఉద్యాన పంటలు, పశుగ్రాసం తదితర సంప్రదాయ వంగడాల విత్తనాలను సమీకరించి పరిరక్షించే బాధ్యతలను కలికిరి కృషి విజ్ఞాన కేంద్రానికి అప్పగించింది. ఇందులో భాగంగా ఈ నెల 15న కలికిరిలో రాయలసీమ స్థాయి దేశవాళీ వంగడాలు సాగుచేస్తున్న రెతుల సదస్సు ఏర్పాటు చేసినట్లు కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు.

రాయలసీమలోని చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప, నంద్యాల, సత్యసాయి, అనంతపురం జిల్లాల్లోని దేశవాళీ రకాలను కాపాడుకొస్తున్న రైతులు, రైతు సంఘాలతో ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు కోఆర్డినేటర్ వివరించారు. రైతులు తరతరాలుగా కాపాడుకొస్తున్న దేశవాళీ ఆహార ధాన్యాలు, ఉద్యాన పంటలు (పూలతో సహా), పశుగ్రాసానికి సంబంధించిన విత్తనాలను ఈ సదస్సులో ప్రదర్శించనున్నట్లు ఆమె తెలిపారు. ఈ జిల్లాల్లోని రైతులు తాము ప్రదర్శించబోయే రకాల గురించి ముందుగానే సమాచారం అందజేసి, పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. దేశవాళీ రకాలను సంరక్షిస్తున్న రైతులకు వివిధ రకాల లబ్ధి చేకూరేందుకు ఈ సదస్సు ద్వారా అవకాశం కలుగుతుందని తెలిపారు. పేర్లు నమోదుకు, లేదా ఇతర వివరాల కోసం కేవీకే కోఆర్డినేటర్‌ను 8008500320 లేదా 9618934777 నంబర్లలోనూ లేదా కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ నవీన (పశువైద్య విభాగం 9502888728), డాక్టర్ పీరూసాహెబ్ (సస్యరక్షణ 7989850004), డాక్టర్ ఎ.శ్రీనివాసులు (ఉద్యాన విభాగం 8008724284), డాక్టర్ మాధురి (విస్తరణ విభాగం 6303197399), డాక్టర్ ఎస్.సోమశేఖర్‌బాబు (సేద్య విభాగం 9440500167) లను సంప్రదించాలని కోరారు.

పుల్లంపేటలో భారీ చోరీ

160 గ్రాముల బంగారం, రూ.8 లక్షల నగదు...



ఇంటిని పరిశీలిస్తున్న ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్

పుల్లంపేట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : స్థాని క నాగులమాను వీధిలో నివాసం ఉంటున్న షేక్ మస్తాన్ ఇంటిలో మంగళవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ చోరీలో 160 గ్రాముల బంగారం, 8 లక్షల నగదు, 70 గ్రాములు వెండి మాయమైనట్లు బాధితుడు పుల్లంపేట పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే... బాధితుడు మస్తాన్ గల్ఫ్ ఏజెంటుగా జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం కుటుంబ సభ్యులతో కలిసి రాయచోటికి వెళ్లాడు. బుధవారం ఉదయం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో పక్కంటిలో నివాసం ఉంటున్న వారు మీ ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి, మీరెక్కడున్నారంటూ ఫోన్లో అడిగారు. దీంతో రాయచోటిలో ఉన్న మస్తాన్ తమ బంధువులను ఇంటి వద్దకు పంపారు. ఇంటిలో చోరీ జరిగిన విషయం తెలుసుకుని వెంటనే రాయచోటి నుంచి పుల్లంపేటకు వచ్చారు. ఇంటిలో చోరీ జరిగిన విషయాన్ని పోలీసుస్టేసన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. దీంతో రూరల్ సీఐ రమణ, ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్‌లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీమ్‌ను పిలిపించి వేలిముద్రలు సేకరించారు. దీనిపై ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ చోరీపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

ఎస్జీటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయండి

- కమిషనర్‌ను కోరిన ఎన్‌టీఏ నేతలు

రాయచోటిటౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ కార్పొరేషన్ పరిధిలోని ఉన్నత పాఠశాలల్లో ఉన్న 120 సెకండరీ గ్రేడ్ పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేయాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ విజయరామరాజుకు ఎన్‌టీఏ నాయకులు వినతిపత్రం సమర్పించారు. నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండూరు శ్రీనివాసరాజు, బొనిగల హైమారావు బుధవారం కమిషనర్‌తో మాట్లాడుతూ 2009లో రాష్ట్రంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో ఉన్న సెకండరీ గ్రేడ్ పోస్టులను స్కూల్ అసిస్టెంట్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేశారని, ఒక్క విజయవాడ కార్పొరేషన్‌లో 120 సెకండరీ గ్రేడ్ పోస్టులను ఇంతవరకు అప్‌గ్రేడ్ చేయలేదన్నారు. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్‌లలోని ఉన్నత పాఠశాలల్లో అప్ గ్రేడ్ అయిన పాఠశాలలకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, అన్ని సబ్జెక్టులకు స్కూల్ అసిస్టెంట్లను మంజూరు చేయాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అలాగే ప్రస్తుత బదిలీల్లో పదవీ విరమణ వయస్సు మూడు సంవత్సరాలలోపు ఉన్న వారికి బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, అలాగే విడాకులు పొందిన మహిళలకు ప్రత్యేక కేటగిరి కింద చూపాలని, 1998, 2008 ఎంటీఎస్ ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయస్సు 60 సంవత్సరాల నుంచి 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి శ్రీనివాసరావు, వైవీ చిట్టిబాబు, గోవిందు నాగరాజు, కోదండపాణి పాల్గొన్నారు.

అపార్ ఐడీ తప్పనిసరి : డీఈవో

సంబేపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): డ్రాపౌట్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థికి అపార్ ఐడీ తప్పనిసరిగా ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం సంబేపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యే విద్యార్థుల పేర్లు డ్రాప్ బాక్స్‌లో ఉంచరాదన్నారు. అలా ఉండే విద్యార్థులను తిరిగి చేర్చుకుని వారితో ఫొటో దిగి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు విద్యార్థుల నమోదు కార్యక్రమం చేపడతామన్నారు. కార్యక్రమంలో సమ్మిళిత విద్య జిల్లా కో-ఆర్డినేటర్ జనార్ధన్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోదండరాముడి సన్నిధిలో ఎంపీలు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కోదండరామాలయాన్ని కడప, రాజంపేట ఎంపీలు వేర్వేరుగా వచ్చి సందర్శించారు. ఉదయం కడప పార్లమెంట్ సభ్యుడు అవినాశ్‌రెడ్డి కోదండరామున్ని దర్శించుకున్నారు. మధ్యాహ్నం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. కార్యక్రమంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, రాష్ట్ర మాజీ డైరెక్టర్ ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, వైసీపీ నాయకులు సిగ్గే భాస్కర్‌రెడ్డి, నందకిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కోదండరామాలయంలో ఎంపీ మిథున్, ఎమ్మెల్యే ఆకేపాటి

ఉపాధి పనుల్లో వేగం పెంచాలి

డ్వామా పీడీ వెంకటరత్నం



పనులను పరిశీలిస్తున్న పీడీ వెంకటరత్నం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనుల్లో వేగం పెంచాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరత్నం ఆదేశించారు. బుధవారం రైల్వేకోడూరు మండలంలోని గుండాలపల్లె, ఓబనపల్లె గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. రైల్వేకోడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో ముమ్మరంగా ఫారంపాండ్స్ పనులు జరుగుతున్నాయన్నారు. ఉపాధిలో అవినీతి రహితంగా చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని తెలిపారు. పనుల్లో ఎక్కడా అవినీతి లేకుండా చేయాలని అధికారులను సూచించారు. ఫారంపాండ్స్ వల్ల భూగర్భజలాలు పెరుగుతాయని తెలిపారు. అనంతరం అటవీశాఖ నర్సరీలో డ్వామా ద్వారా పెరుగుతున్న మొక్కలను పరిశీలించారు. కార్యక్రమంలో రైల్వేకోడూరు ఉపాధి ఏపీవో మృత్యుంజయరావు, అసిస్టెంట్ క్వాలిటీ అధికారి ఉమామహేశ్వర్, అటవీశాఖ డీఆర్‌వో డీపీ గురవయ్య, ఎఫ్‌బీవో ప్రసన్న, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం

పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి



అధ్వానంగా ఉన్న రోడ్డును పరిశీలిస్తున్న ఎస్ఈ

సుండుపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రోడ్ల సౌకర్యమే లక్ష్యమని పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులరెడ్డి అన్నారు. పల్లెపండుగ కార్యక్రమంలో బుధవారం మండలంలోని ఆరెమ్మ వీధిలో ఏర్పాటు చేసిన సీసీ రోడ్లు, కల్వర్టులను ఆయన పరిశీలించారు. అనంతరం చిన్నగొల్లపల్లి గ్రామ పంచాయతీలో ప్రధాన రహదారి నుంచి పూజారివాండ్లపల్లెకు తారు రోడ్డు ఏర్పాటుకు పరిశీలించారు. త్వరలో రోడ్డు పనులు ప్రారంభిస్తామన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. రోడ్ల పనుల్లో రాజీపడకూడదని, నాణ్యమైన రోడ్లను వేయాలని ఆదేశించారు. ఎక్కడెక్కడ రోడ్ల వసతి లేదో ఆరా తీశారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి పల్లెల్లో మట్టి రోడ్లు లేకుండా చేస్తామన్నారు.

కారు, స్కూటర్ ఢీ : యువకుడు మృతి



వరుణ్‌కుమార్‌రెడ్డి మృతదేహం

రామాపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు-చిత్తూరు 40వ జాతీయ రహదారి రామాపురం మండలం బండపల్లి సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నల్లగుంట్ల వరుణ్‌కుమార్‌రెడ్డి (23) మృతి చెందినట్లు రామాపురం ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... వెంకటరెడ్డిగారిపల్లెకు చెందిన వరుణ్‌కుమార్‌రెడ్డి కరెంటు పనులు చేసేవాడు. పనులు ముగించుకొని రాయచోటి నుంచి ద్విచక్రవాహనంపై ఇంటికి వస్తుండగా కమలాపురానికి చెందిన మధురమోహన్‌రెడ్డి కారులో రాయచోటికి వస్తూ ఎదురుగా వస్తున్న స్కూటర్‌ను ఢీకొన్నాడు. ఈ సంఘటనలో వరుణ్‌కుమార్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జాతీయ రహదారిలో పార్కింగ్

సిద్దవటం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఒంటిమిట్టలో ఈనెల 11న సీతారాముల కల్యాణం సందర్భంగా కడప నుంచి వచ్చే భక్తుల వాహనాలు పెట్టుకోవడానికి పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు తెలిపారు. మండలంలోని కడప-చెన్నై జాతీయ రహదారి సాయినగర్, ఉప్పరపల్లె, మాచవరం, సాయిబాబా టెంపుల్, తదితర ప్రాంతాల్లో 13 పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు మాట్లాడుతూ సీతారాముల కల్యాణం సందర్భంగా కడప నుంచి వచ్చే భక్తులకు వాహనాలు నిలుపుదలకు పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశామని, పార్కింగ్ ప్రదేశాల నుంచి ఉచితంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేశామని, ప్రతి ఒక్కరూ కల్యాణం చూసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే పథకాలు

జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రానాయక్

రైల్వేకోడూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య ఉంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని జిల్లా వ్యవసాయశాఖాధికారి బి.చంద్రానాయక్ తెలిపారు. బుధవారం రైల్వేకోడూరు, పుల్లంపేట, చిట్వేలి, ఓబులవారిపల్లె మండలాలకు చెందిన వ్యవసాయశాఖాధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమాన్ని ఈనెల 15తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ సహాయ సంచాలకులు కవిత, రైల్వేకోడూరు మండల వ్యవసాయ శాఖాధికారి జి.సుధాకర్, వ్యవసాయశాఖ టెక్నికల్ అధికారి శ్రీరాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంగంపేట గనులను పరిశీలించిన

ఐబీఎం అధికారులు

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ గనుల శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు సంబంధిత అధికారులతో కలిసి మంగంపేట ఏపీఎండీసీ బ్రాంచ్ పరిధిలో ఉన్న గనులను బుధవారం పరిశీలించారు. మైనింగ్ ప్రక్రియలో భాగంగా బ్లాస్టింగ్, ట్రాన్స్‌పోర్ట్, గ్రేడింగ్‌లను పరిశీలించిన ఇండియన్ బ్యూరో ఆఫ్ మినరల్ అధికారులు మైనర్ మినరల్‌గా ఉన్న మంగంపేట గనులు మేజర్ మినరల్‌గా అధికారులు గుర్తించడంతో అందుకు సంబంధించిన ప్రక్రియను పరిశీలించారు. అలాగే మైనింగ్‌కు సంబంధించి పలు అంశాలపై మంగంపేట ఏపీఎండీసీ అధికారులతో చర్చించారు.

మంటలార్పేదెలా?

- ఫైరింజన్‌లకు నీరు కరువు
- ప్రైవేటు బోర్లే గతి
- 21 ఏళ్లుగా ఇదే పరిస్థితి
- సమస్యల వలయంలో అగ్నిమాపక కేంద్రం



ప్రైవేటు బోరు వద్ద ఫైరింజన్‌కు నీరు పడుతున్న సిబ్బంది (ఫైల్)

ములకలచెరువు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సూర్యుడు భగభగ మండుతున్నాడు. ఎండలు తీవ్రరూపం దాల్చాయి. అగ్ని ప్రమాదాలు జోరందుకున్నాయి. ఈ తరుణంలో మంటలు ఆర్పేందుకు ఫైరింజన్‌కు నీరు కరువైంది. 21 ఏళ్లుగా ఈ పరిస్థితి ఉన్నా ఫైరింజన్‌కు నీటి సమస్య తీర్చే నాథుడే లేడు. చేసేది లేక ప్రైవేటు బోర్ల వద్ద ఫైరింజన్‌కు నీరు పట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అగ్నిమాపక కేంద్రంలో ఏళ్ల తరబడిగా నెలకొన్న సమస్యలు పరిష్కారం కావడం లేదు. తంబళ్లపల్లె నియోజకవర్గానికి సంబంధించి 2004లో ములకలచెరువులోని సింగిల్‌విండో కార్యాలయంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ అగ్నిమాపక కేంద్రం పరిధిలో ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో ప్రతి ఏటా వేసవిలో అత్యధికంగా అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. అగ్నిప్రమాదాలు జరిగితే ఇక్కడి నుంచి ఫైరింజన్ వెళుతోంది. ఈ క్రమంలో అగ్నిమాపక కేంద్రాన్ని 2007లో మార్కెట్ యార్డులోని ఇరుకైన గదిలోకి మార్చారు. అగ్నిమాపక కేంద్రం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు పక్కాభవనం లేదు. ఫైరింజన్‌కు నీటి వసతి కూడా కల్పించలేదు. ఫైరింజన్‌కు నీరు నింపాలంటే సిబ్బంది ప్రైవేటు బోర్లను ఆశ్రయిస్తున్నారు. ఏళ్ల తరబడిగా ఫైరింజన్‌కు నీటి వసతి లేక అగ్నిమాపక సిబ్బంది పడుతున్న కష్టాలు వర్ణణాతీతంగా మారాయి. ప్రస్తుతం ఓ కల్యాణమండపంలోని బోరులో నీరు నింపుకుంటున్నారు. అలాగే పక్కా భవనం లేక ఇరుకైన గదిలోనే సిబ్బంది ఉండాల్సి వస్తోంది. మొత్తం 14 మంది సిబ్బందికి గానూ ఎనిమిది పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యంగా ఎనిమిది మంది ఫైర్‌మెన్‌లకు గానూ ఒక్కరే ఉన్నారు. సిబ్బంది కొరతతో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు మంటలు ఆర్పేందుకు ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి అగ్నిమాపక కేంద్రంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించడంతో పాటు ముఖ్యంగా ఫైరింజన్‌కు నీటి వసతి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

పక్కా భవనానికి నిధులు మంజూరు



ములకలచెరువు అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.25 కోట్లు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ కూడా జరిగింది. భవన నిర్మాణం పూర్తయితే సమస్యలు పరిష్కారమవుతాయి. ఫైరింజన్‌కు నీటి వసతి కూడా కల్పిస్తారు. ఫైరింజన్ కండీషన్ బాగుంది. ఎక్కడైనా అగ్నిప్రమాదాలు జరిగితే వెంటనే సమాచారం ఇవ్వండి.

- నరసింహులు, అగ్నిమాపక అధికారి, ములకలచెరువు

27 రోజుల్లో 24 అగ్నిప్రమాదాలు

మారుమూల ప్రాంతం కావడంతో అగ్నిప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయి. ఈనెల 1వతేదీ నుంచి ఇప్పటి వరకు 24 అగ్నిప్రమాదాలు జరిగాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అగ్ని ప్రమాదాల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూనే ఉంది. మూరుమూల ప్రాంతాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఫైరింజన్ వెళ్లలేని పరిస్థితితి నెలకొంది.



మార్కెట్ కమిటీ కార్యాలయంలో అగ్నిమాపక కేంద్రం

ఈ-శ్రమ్.. కార్మికులకు వరం

నమోదులో అధికార యంత్రాంగం కసరత్తు



ప్రొద్దుటూరు రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత వలస కార్మికులకు సామాజిక భద్రత కల్పించి... సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ-శ్రమ్ కార్మికులకు ఓ వరం లాంటిది. ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని కార్మిక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఈ-శ్రమ్‌లో వివరాల నమోదుకు సమీప గ్రామ, వార్డు సచివాలయాలు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌ఈ) కార్మిక శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలి. ఈ ప్రక్రియ పూర్తయ్యాక యూఏఎన్ గుర్తింపు కార్డు జారీ అవుతుంది.

జిల్లాలో మొత్తం 7.50 లక్షల మంది కార్మికుల వివరాలు నమోదు లక్ష్యం కాగా ఇప్పటికి 3,67,933 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ప్రయోజనాలపై కార్మిక శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేస్తూ అసంఘటిత కార్మికులకు చేకూరే ప్రయోజనాలను వివరిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

అర్హులైన వారు పేర్లు నమోదు చేసుకుంటే ప్రభుత్వ ప్రయోజనాలు వర్తిస్తాయి. ఈ-శ్రమ్‌లో నమోదు అయితే గుర్తింపు కార్డు అందజేస్తారు. పథకాన్ని అసంఘటిత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలి.

- శ్రీకాంత్‌నాయక్, కార్మికశాఖ ఉపకమిషనర్, కడపజిల్లా

వీరంతా అర్హులే

18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన అసంఘటిత రంగ కార్మికులు, ఈపీఎఫ్ సభ్యత్వం లేనివారు, ఆదాయ పన్ను పరిధిలోకి రానివారు అర్హులు. ఉపాధి హామీ కూలీలు, మత్స్యకారులు, భవన నిర్మాణ, పారిశుధ్య కార్మికులు, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలు, మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు, వ్యవసాయ, ఉద్యాన, పాడిపరిశ్రమ కూలీలు, కుమ్మరి, స్వర్ణకారులు, ఇతర చేతివృత్తులవారు, సేవా రంగంలో ఉన్నవారు, బిగ్ వర్కర్స్ జొమోటా, స్విగ్గి వంటి (ఫుడ్ డెలివరి కార్మికులు) కార్మికులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందవచ్చు

నమోదు ఉచితం

ఈ-శ్రమ్‌లో వివరాల నమోదుకు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్ పత్రాలు, ఆధార్‌కు అనుసంధానమైన సెల్‌ఫోన్ నంబరు, నామిని ఆధార్ వివరాలు అవసరం. వార్డు సచివాలయాలు, కామన్ సర్వీస్ సెంటర్, కార్మిక శాఖ కార్యాలయాల్లో సంప్రదిస్తే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తిగా ఉచితం. ఎలాంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేదు. అంతా అయ్యాక యూఏఎన్ గుర్తింపు కార్డు జారీ అవుతుంది.

ప్రయోజనాలు ఎన్నో...

నమోదు అయిన కార్మికులు ప్రమాదవశాత్తు మరణించినా, శాశ్వత అంగవైకల్యానికి గురైతే రూ.2 లక్షలు, పాక్షికంగా గాయపడితే రూ.లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందుతుంది. వలస కార్మికులకు ఎంతో ఊరటనిచ్చే ప్రయోజనాలు కలుగనున్నాయి. ఈశ్రమ్‌లో నమోదు అయినవారు ప్రభుత్వ వృత్తి నైపుణ్య శిక్షణ ఉపాధి అవకాశాలు పొందవచ్చు.


కార్మికుల వివరాలను రిజిస్టర్ చేస్తున్న లేబర్ ఆఫీసర్ పావని(ఫైల్‌ఫోటో)

ప్రకృతి వ్యవసాయంతో అందరికీ ఆరోగ్యం


బలసింగాయపల్లెలో ప్రకృతి వ్యవసాయంపై మాట్లాడుతున్న డాక్టర్ బలరామ్‌కిషన్

చెన్నూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రైతులు రసాయన రహిత వ్యవసాయం చేపట్టాలని.. తద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతంగా ఉంటారని మధ్యప్రదేశ్‌కు చెందిన కిసాన్ పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బలరాం కిషన్ అన్నారు. మండలంలోని బలసింగాయపల్లెలో బుధవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలన్న లక్ష్యంతో అన్ని రాష్ట్రాల్లో కిసాన్ పాఠశాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి పంటకు తెగుళ్లు వ్యాపిస్తుంటాయని, రసాయన మందులు ఇష్టానుసారం వాడుతున్నాం కాబట్టి తెగుళ్లు ఆశిస్తున్నాయని తెలిపారు. కషాయాలతో తెగుళ్లను పూర్తిగా నివారించవచ్చ న్నారు. అలాగే రైతులు అడిగిన పలు సందేహాలకు ఆయన సమాధానాలిచ్చారు. కాగా, ఆదర్శ రైతు బాలచంద్రుడు బలసింగాయపల్లెలో సాగు చేసిన పసుపు పంటను బలరామకిషన్ రైతులతో కలిసి పరిశీలించారు. అలాగే రసాయనాలతో సాగు చేసిన పసుపు పంట పరిశీలించారు. ఈ రెంటికీ తేడాను రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. ప్రకృతి సేద్యంతో సాగు చేసిన పసుపు రెట్టింపు దిగుబడి వచ్చిందని తెలిపారు. ఏపీసీఎన్‌ఎఫ్ జిల్లా ప్రాజెక్టు అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఆయుర్వేద వైద్యులు డాక్టర్ వెంకట్రమణ, ఆదర్శ రైతు చదిపిరాళ్ల ప్రసాద్‌రెడ్డి, కొండారెడ్డి, అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలకు విశేష స్పందన



క్యాంపస్ ఇంటర్వ్యూలలో పాల్గొన్న విద్యార్థులతో నారాయణ విద్యాసంస్థల ఏజీఎం, కోఆర్డినేటర్లు తదితరులు

సీకేదిన్నె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): క్యాంపస్ ఇంటర్వ్యూలకు విశేష స్పందన లభించినట్లు కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వీఎస్ఎస్ మూర్తి తెలిపారు. నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో బుధవారం కేఎస్‌ఆర్‌ఎం, కేఎల్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. నారాయణ విద్యాసంస్థల రాయలసీమ జోన్ హెచ్‌ఆర్ రిక్రూటర్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో విద్యార్థినీ విద్యార్థులకు మూడు విధాలుగా రాత పరీక్ష, డెమో, ఇంటర్వ్యూ చేసి ప్రతిభ ఆధారంగా ఎంపిక చేశామని తెలిపారు. కార్యక్రమానికి సహకరించిన కేఎస్‌ఆర్‌ఎం విద్యాసంస్థల ఎండీ చంద్ర ఓబుళరెడ్డి, పీటీవో ఆఫీసర్స్ నాగరాజు, సిద్దిక్‌కు నారాయణ విద్యాసంస్థల ఏజీఎం, కోఆర్డినేటర్లు ధన్యవాదాలు తెలిపారు. అధ్యాపకులు, హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

జగన్‌కు పదవి పోయినా తగ్గని అహంకారం

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్


విలేకరులతో మాట్లాడుతున్న హరిప్రసాద్

కడప ఎర్రముక్కపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జగన్‌కు ప్రజలు బుద్ధి చెప్పినా ఇంకా అహంకారం తగ్గలేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్ మండిపడ్డారు. బుధవారం నగరంలోని హరిటవర్స్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తన ప్రభుత్వంలో పోలీసులను ఇష్టమొచ్చినట్లు వాడుకొని ఇప్పుడు వారిని బట్టలూడదీసి నిలబెడతామనడం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. జగన్ హత్యారాజకీయాల గురించి మాట్లాడుతుంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. గత ప్రభుత్వంలో జిల్లాలో ఎన్ని హత్యలు జరిగాయో సమాధానం చెప్పాలన్నారు. వ్యవస్థలపై దాడి చేయడం జగన్‌కు అలవాటేనన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు నాగరాజు, గంధం ప్రసాద్, టీడీపీ నాయకులు అమీర్ ఖాసీం పాల్గొన్నారు.

చీనీ తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు


అంకాళమ్మగూడూరులో చీనీ తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సింహాద్రిపురం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండలం లోని బలపనూరు, అంకాళమ్మగూడూరు, హిమకుంట్ల, సుంకేసుల, అహోబిళం గ్రామాల్లో చీనీ తోటలను బుధవారం శాస్త్రవేత్తలు రామకృష్ణ, కె.అరుణోదయం పరిశీలించారు. కొన్ని గ్రామాల్లో చీనీ తోటలకు నీటి తడులు అధికంగా అందించడం, భూమిలో తేమ ఆరకపోవడంలో వేర్లు త్వరగా కుళ్లిపోయి చెట్లు క్షీణిస్తున్నాయని శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. చీనీ చెట్లు దెబ్బతినకుండా ఉండాలంటే నేల స్వభావంను బట్టి ఒక తడికి 60 లీటర్లు మించి నీరు ఇవ్వకూడదన్నారు. వేరుకుళ్ళు కనిపించిన తోటల్లో సస్యరక్షణ చర్యలు చేపడితే శాశ్వతంగా నివారించుకోవచ్చని రైతులకు వివరించారు. ఉద్యానవనశాఖ అధికారి మల్లేశ్వర్‌రెడ్డి, వీహెచ్‌ఏలు శ్రీలేఖ, ఉష, దీపిక రైతులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన పోలీసులు

జమ్మలమడుగు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల ఎదుట మార్చి 24వ తేదీ రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో బట్టు కిశోర్‌బాబు (33) అనే వ్యక్తి మృతి చెందాడు. అయితే కిశోర్‌బాబు మృతి విషయంలో అనుమానం ఉన్నట్లు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన విచారణ చేపట్టినట్లుసీఐ లింగప్ప తెలిపారు. మృతుడు కిశోర్‌బాబుకు అన్న వరుస అయిన దేవరపల్లి ఉదయ్‌కుమార్ ప్రొద్దుటూరు టౌన్‌లో మార్చి 20వ తేదీ ఓ కార్యక్రమానికి వెళ్లి అక్కడ వారిద్దరు ఘర్షణ పడినట్లు తెలిపారు. ఆరోజు నుంచి ఎలాగైనా ఆయనను చంపాలని ఉదయ్‌కుమార్ మార్చి 24వ తేదీ జమ్మలమడుగుకు ఏపీ39యూపీ3392 నెంబరు గల ఐచర్ వాహనంలో వచ్చి జమ్మలమడుగులో కిశోర్‌బాబుకు ఫోన్ చేసి నీ అంతు చూస్తానని చెప్పినట్లు విచారణలో తేలిందన్నారు. అదే రోజు రాత్రి ఐచర్ వాహనంలో ద్విచక్ర వాహనాన్ని వెనుకవైపు నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై మృతి చెందాడు. ఈ కేసును ఛేదించి నిందితుడు ఉదయ్‌కుమార్ అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

గుంతకల్ రైల్వేడివిజన్‌లో కొత్త రైల్వేలైన్లు నిర్మించాలి

● రైల్వే సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి



పులివెందుల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): గుంతకల్లు డివిజన్‌లో ఉన్న రైల్వేలైన్లే కాకుండా కొత్తగా రైల్వేలైన్లు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం గుంతకల్ రైల్వేడివిజన్ పరిధిలో సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సమీక్ష సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ గుంతకల్ రైల్వేడివిజన్‌లో గతంలో పలు స్టేషన్లలో రైళ్లు ఆగుతున్నా వాటిని రద్దు చేయడం జరిగిందన్నారు. అవసరం ఉన్న చోట మళ్లీ స్టాపింగ్‌లను పునరుద్ధరించాలన్నారు. ముదనూరు-ముదిగుబ్బ కొత్త రైల్వేలైన్‌ను ఏర్పాటుకు గుంతకల్ డివిజన్ చొరవ చూపాలన్నారు. ఈ రైల్వేలైన్ కేవలం 65కిలోమీటర్లు మాత్రమే నిర్మిస్తే కడప, నంద్యాల జిల్లాల వారిని సత్యసాయి జిల్లాతో అనుసంధానం ఏర్పడుతూ కర్ణాటక రాష్ట్రంతోను అనుసంధానించవచ్చన్నారు. కడప, నంద్యాల ప్రజలకు బెంగుళూరుకు పోయేందుకు సరైన రైలు సౌకర్యం లేదన్నారు. ఈ ప్రాంతాల నుంచి ప్రతినిత్యం పారిశ్రామిక ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేయడం సులభతరమ వుతుం దన్నారు. గతంలో హుబ్లి-తిరుపతిల మధ్య ప్యాసింజర్ రైలు, గుంతకల్-విజయవాడ మధ్య నడిపేవారన్నారు. ఈ రైల్లు పేద లకు ఎంతో ఉపయోగకరంగా ఉండేవన్నారు. అది రద్దుచేయడం వల్ల ప్రజలు ఇబ్బందిపడుతున్నారన్నారు. కడప-అనంతపురం-రేణిగుంట-రాయచూర్ రైల్వేస్టేషన్లలో మొన్నటి వరకు ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు రిజర్వేషన్ టికెట్ ఇచ్చేవారన్నారు. కానీ ఉన్నఫలంగా రిజర్వేషన్ సమయాన్ని కుదించి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి 8గంటల వరకు మాత్రమే రిజర్వేషన్ కౌంటర్లను తెరుస్తున్నారన్నారు. ఇది ప్రయాణికులకు ఇబ్బందిగా ఉందన్నారు. ఇక ధర్మవరం-మచిలీపట్నం రైళ్లను కొండాపురంలో ఆపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. హరిప్రియ ఎక్స్‌ప్రెస్, గోవా-తిరుపతి ఎక్స్‌ప్రెస్, చెంగల్‌పట్టు ఎక్స్‌ప్రెస్, ఎంజీబీ చెన్నై సెంట్రల్ సూపర్‌ఫాస్ట్‌రైళ్లను రైల్వేకోడూరులో స్టాపింగ్ ఏర్పాటు చేయాలని కోరారు.



రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారం వద్ద బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి రైలుకింద పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. సుమారు 45 సంవత్సరాల వయసున్న మృతుడు ఎరుపు ఆకుపచ్చ తెలుపు కలిగిన చొక్కా ధరించి.. ఎడమకాలు మడిమ వద్ద కట్టు కట్టుకొని ఉన్నాడు. వివరాలు తెలిస్తే 9440627658 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు తెలిపారు.

మట్కా బీటర్లు అరెస్టు

జమ్మలమడుగు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు పట్టణంలో బుధవారం మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఉమ్మడిశెట్టి ఆదిలక్ష్మి, మేషా స్వరూప, గుర్రం చిన్నచెన్నయ్య మట్కా నిర్వహిస్తుండగా అరెస్టు చేసి, వారి వద్ద నుంచి మట్కా పట్టీలతో పాటు రూ.26,050 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చాపాడు ఎస్‌ఐపై ఎస్పీకి ఫిర్యాదు

చాపాడు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): చాపాడు మండల ఎస్‌ఐ చిన్నపెద్దయ్యపై ఎస్పీ అశోక్‌కుమార్‌కు ఈనెల 7వ తేదీన సోమవారం ఫిర్యాదు చేసినట్లు నాగులపల్లె గ్రామానికి చెందిన సానా నరసింహారెడ్డి తెలిపారు. తన కుమారుడు విద్యాసాగర్‌రెడ్డిపై ఎస్‌ఐ, ట్రైనింగ్ డీఎస్పీ భవానీ వేధిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. 29.09.2024వ తేదీ విద్యాసాగర్‌రెడ్డి అదే గ్రామానికి చెందిన మల్లికార్జునరెడ్డిని కారుతో ఢీకొట్టినట్లు హత్యాయత్నం కేసు నమోదు చేశారన్నారు. ఈ విషయమై అప్పట్లో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికి వారు ఫిర్యాదును తీసుకోలేదన్నారు. హైకోర్టులో పిటీషన్ వేయగా కోర్టు ఫిర్యాదును స్వీకరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు మళ్లీ ఎస్పీ, మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్‌కు ఇటీవల అర్జీలు ఇచ్చినట్లు తెలిపారు. ఈనెల 3వ తేదీ చాపాడు పోలీసు స్టేషన్‌లో ట్రైనింగ్ పొందుతున్న డీఎస్పీ భవానీ తన కుమారుడు విద్యాసాగర్ రెడ్డిని పోలీసు స్టేషన్‌కు పిలిపించుకుని బైండోవర్ కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ, భవానీ బెదిరించినట్లు వారు ఆరోపించారు. ఎస్‌ఐపై విచారణ జరపాలని కోరామన్నారు.

ఈ విషయమై ఎస్‌ఐ చిన్నపెద్దయ్యను ఫోన్‌లో వివరణ అడుగగా సానా నరసింహారెడ్డిని కానీ, ఆయన కుమారుడు విద్యాసాగర్‌రెడ్డిని కానీ బెదిరించలేదన్నారు. చట్ట ప్రకారమే వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు.

కడప జలవనరుల శాఖ డీఈఈ ధనంజయులుకు ఊరట

కలికిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖలో కడప ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఎస్-1 డివిజన్ డీఈఈ ధనంజయులుకు ఊరట దక్కింది. ఆయనపై నమోదైన కొన్ని అభియోగాల నుంచి ఆయనకు విముక్తి కల్పిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సోమశిల ప్రాజెక్టు కోసం భూములు సేకరించే క్రమంలో జిల్లాలోని అట్లూరు మండలం ముత్తుకూరు గ్రామంలోని చౌటపల్లెలోని సర్వే నంబర్లు 15, 16/1, 19/3లోని భూములను పరిశీలించడంలో తప్పుడు నివేదికలను పంపిన కారణంగా ఆయనపై అభియోగాలు నమోదు చేసి 2024 మార్చి 4న సంజాయిషీలు కోరారు. అదే నెల 27న ఒకసారి, జూన్ 10న మరోసారి ధనంజయులు తన వివరణలను సమర్పించారు. తన తనిఖీల సమయంలో భారీ వరదల కారణంగా తాను నైపుణ్యంలేని కూలీలతో పనులు చేయించాల్సి వచ్చిన కారణంగా కొన్ని మానవ తప్పిదాలు జరిగినట్లు అంగీకరించారు. ధనుంజయులు సమర్పించిన సంజాయిషీలపై ప్రభుత్వం కడప ఎన్టీఆర్ తెలుగు గంగ ప్రాజెక్టు ఎస్‌ఈని విచారణాధికారిగా నియమించింది. ఆయన అందజేసిన విచారణా నివేదికను పరిశీలించిన ప్రభుత్వం ధనుంజయులుపై తదుపరి చర్యలను ఉపసంహరిస్తూ రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి.సాయిప్రసాద్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

ప్రొద్దుటూరు కోర్టుకు ఏపీపీ నియామకం

కలికిరి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. న్యాయవాది మార్తాల సుధాకర్ రెడ్డిని ఏపీపీగా నియమించారు. నెలకు రూ.40 వేల గౌరవ వేతనంతో మూడేళ్లపాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారని పేర్కొంటూ రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు.

పాఠశాలల ప్రారంభ సమయానికి విద్యార్థి కిట్టు అందజేయాలి

కడప ఎడ్యుకేషన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పాఠశాల ప్రారంభం సమయానికి విద్యార్థి కిట్టు అందించాలనే లక్ష్యంతో రాష్ట్రప్రభుత్వం వేసవి సెలవుల్లోని విద్యార్థి కిట్టులోని అన్నిరకాల సామాగ్రిని జిల్లా, మండల, స్కూల్ పాయింట్‌కుచేరేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు సర్వేపల్లె రాధాకృష్ణ విద్యార్థి మిత్ర రాష్ట్ర అబ్జర్వర్ పీవీకే ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం వైఎస్సార్ జిల్లాలోని ఒంటిమిట్ట, సిద్దవటం, చింతకొమ్మదిన్నె, చెన్నూరు, ఖాజీపేట, కడప మండలాలస్టాక్ పాయింట్లను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ స్టాక్ పాయింట్లలో స్టాక్ భద్రపరిచే సమయంలో ఎటువంటి ఇబ్బందికి కలగకుండా ప్రదేశాలను చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లాసమగ్ర శిక్ష కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్ కోఆర్డినేటర్ దశరథరామ్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి-2 షేక్ ఇర్షాద్ అహ్మద్, మండల కమిటీ సభ్యులు దేవ సహాయం, సాగర్, మండల వనరుల కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

కుందూలో జలకళ

రాజుపాలెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గత ఏడాది సకాలంలో వర్షాలు లేక ఏప్రిల్ మాసంలో కుందూనది పూర్తిగా ఎండిపోయింది. అయితే ఈ సంవత్సరం సకా లంలో వర్షాలు పడడంతో కుందూలో నీళ్ల ప్రవహి స్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కుందూ నది పరివాహకం వెంబడి ఉన్న పొలాల్లో పూలతోటలు, వరి, నూగు, కొర్ర పంటలు సాగు చేశారు. ఈ పంటలకు పుష్కలంగా నీళ్లు అందుతుండటంతో కళకళలాడుతున్నాయి. అదే విధంగా పశువుల దాహార్తి తీర్చేందుకు కుందూ నీరు ఉపయోగపడుతోంది. ఏది ఏమైనా ఏప్రిల్, మే మాసంలో నదిలో నీటి ప్రవాహం ఉండటంతో తరువాత వర్షాలు పడేంత వరకు ఇబ్బంది ఉండదని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



విద్యార్థుల భవిష్యత్తు ప్రధానలక్ష్యం కావాలి

కడప ఎడ్యుకేషన్,ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తు ప్రధాన లక్ష్యం కావాలని వైవీయు వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం యోగివేమన విశ్వవిద్యాలయంలో ఆయన శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. జాతీయ విద్యావిధానం-2020ని ప్రకారం విద్యార్థుల సంపూర్ణ ప్రగతికి విశ్వవిద్యాలయంలోని శాఖల ఆలోచనలు, భవిష్యత్తు ప్రణాళికలు స్టడీ చేసేందుకు ఆయన పలు విభాగాలను సందర్శించారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ పి.సరిత, కామర్స్ సహ ఆచార్యులు డాక్టర్ విజయభారతి, ఎంసీఏ శాఖ సహ ఆచార్యులు డాక్టర్ రెడ్డయ్య పవర్ పాయింట్ ప్రజెటేషన్ ద్వారా వారి వారి విభాగాల అభివృద్ధి గురించి వివరించారు. వైస్ చాన్సలర్ మాట్లాడుతూ నైపుణ్య కేంద్రాలు, విద్యా ప్రయోగశాలలు, పరిశోధన ల్యాబ్‌ల కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను సృష్టించేందుకు పరిశ్రమలు, సంస్థల సహకారం తీసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

వేసవిలో అందరికీ ఉపాధి పనులు

● డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి


ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ

చెన్నూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఉపాధి పనుల సంఖ్య పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి అన్నారు. మండలంలోని శివాలపల్లె పంచాయతీలో ఉన్న గోపవరంలో ఉపాధి కూలీలతో ఆయన మాట్లాడారు. ఈ వేసవిలో అన్ని రకాల కాల్వలు చేసుకునే వెసులుబాటు వచ్చిందని, పంట కాల్వలన్నీ ఎలాంటి ఇబ్బంది లేకుండా చేసుకోవచ్చన్నారు. ప్రధాన కాల్వలో నీరు తగ్గగానే అక్కడ కూడా పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి నుండి జూన్ వరకు చేసిన పనులకు రూ.20నుంచి రూ.30వరకు అద నపు కూలీ వస్తుందన్నారు. రూ.60కోట్లు ఉపాధి పనుల బిల్లులు పెండిం గులో ఉన్నాయని, అందుకు సంబంధించిన నిధులు ఈనెల 17లోగా వస్తాయన్నారు. అలాగే గోకులం షెడ్లకు సంబంధించి రూ.11 కోట్లు అవసరమని, ఆ నిధులు కూడా వస్తాయన్నారు. అనంతరం అదే ప్రాం తంలో ఉపాధి కూలీలు తవ్విన కాల్వలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీవో శైలజ, సీసీలు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పూలే దంపతులకు భారతరత్న ప్రకటించాలి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలేకు భారతరత్న అవార్డులను ప్రకటించా లని బహుజన సేన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీచందు డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బీసీల్లో ఉన్న అన్ని కులాల ను జానాభా ప్రాతిపధికన బీసీ కులగణన చేసి వారికి వచ్చే హక్కులు, రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఈ నెల 11న మదన పల్లె పట్టణంలో బహుజన సేన ఆధ్వర్యం లో మహాసంకల్ప ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీని విజయవంతం చేయాలని బీసీలకు విజ్ఞప్తి చేశారు.

మంత్రిని కలిసిన మదనపల్లె నేత మనోహర్

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్ర జ్యోతి): మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దంపతు లను రాయచోటిలోని ఆయన ఇంట్లో మ దనపల్లెకు చెందిన జనసేన నేత మనో హర్ బుధవారం మర్యాదపూర్వకంగా కలి సి శుభాకాంక్షలు తెలిపారు. చేనేత కా ర్మికులను ఆదుకోవాలని, అభివృద్ధికి తోడ్ప డాలని కోరారు. ఇందు కు మంత్రి సాను కూలంగా స్పందించినట్లు బండి మనోహర్ తెలిపారు.

వీధి లైట్లకు డీపీ స్విచ్ ఏర్పాటు



వీధి లైట్లకు డీపీ స్విచ్ అమరుస్తున్న పంచాయతీ ఉద్యోగి భాస్కర్

తంబళ్లపల్లె, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారితో పాటు పలు వీధుల్లో పట్ట పగలే వీధి లైట్లు వెలుగుతున్నాయంటూ బుధవారం ఆంధ్రజ్యోతిలో 'పగలే వెలుగుతున్న వీధి దీపాలు' అనే శీర్షికన ప్రచురితమైన కథ నానికి పంచాయతీ, ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. బుధవారం ఉదయమే ట్రాన్స్‌కో లైన్‌మన్ శంకర, పంచాయతీ సిబ్బంది భాస్కర్ వీధి లైట్లు వెలుగుతున్న స్తంభాలకు డీపీ స్విచ్ అమర్చి సమస్యను పరిష్కరించారు.

రేపు కలిచెర్ల పోలేరమ్మ తిరునాళ్లు

పెద్దమండ్యం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) మండలంలోని కలిచెర్ల సమీపంలో ఉన్న ఇప్పవనంలో వెలసిన యోగమయ పోలే రమ్మకు ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు తిరునాళ నిర్వహిస్తున్నట్లు కలిచెర్ల సింగల్‌విండో మాజీ చైర్మన్ కడప సుధాకర్‌రెడ్డి వెల్లడించారు. 13వ తేదీ ఆదివారం తిరునాళ్లతో పాటు సోమవారం నుంచి 10 రోజుల పాటు మహాభారతం, ఎద్దుల పరుష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పగలు హరికథ కాలక్షేపం, రాత్రి భారతం నాటకం ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు.

కలికిరి మండల బీజేపీ కార్యవర్గం నియామకం

కలికిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కలికిరి మండల కమిటీని పార్టీ ప్రకటించి నట్లు మండల కమిటీ అధ్యక్షుడుగా నియ మితులైన కుమార్ రెడ్డి తెలిపారు. ఉపా ధ్యక్షులుగా రవీంద్రనాథ రెడ్డి, పి.సైఫుల్లా, నాగభూషణం, సి.ఉమాదేవి, బి.సుధాకర్, ప్రధాన కార్యదర్శులుగా బి.మురళీకృష్ణ, శ్రీనివాసులు, కార్యదర్శులుగా పి.శ్రీనివాసు లు, పి.నవీన్, వి.రెడ్డిశేఖర్, ఎ. రెడ్డెప్ప, కోశాధికారిగా టి.సహదేవ రెడ్డిని నియమి తులయ్యారని ఆయన వివరించారు.

ఆరోగ్య పరీక్షలతో సురక్షిత మాతృత్వం



గర్భిణులకు సూచనలిస్తున్న వైద్యాధికారి చంద్రశేఖర్ నాయక్

పీలేరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరీక్షలతో తల్లీ, బిడ్డల ఆరోగ్య సమస్యల అంచనా సాధ్యమవుతుందని, తద్వారా సురక్షిత మాతృత్వం సాధ్యపడుతుందని పీలేరు మండలం తలపుల పీహెచ్‌సీ వై ద్యాధికారి చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ వంద నం కార్యక్రమంలో భాగంగా బుధవారం పీహెచ్‌సీ పరిధిలోని గర్భిణులు, బాలింత లకు ఆరోగ్య పరీక్షలు, చికిత్సలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ గర్భం దాల్చినప్పటి నుంచి కాన్పు అయ్యే వరకు కనీసం నాలుగుసార్లు ఆరో గ్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. తద్వా రా పిండం ఎదుగుదల, తల్లిలో రక్తహీన త, అధిక రక్తపోటు, మధుమేహం, గుర్రపు వాతం, తదితర క్లిష్ట సమస్యలు తెలుసు కుని తగు చర్యలు తీసుకోవచ్చున్నారు. అనంతరం పీహెచ్‌సీ ఉద్యోగిని హంసవేణి సహాయ సహకారాలతో 26 మంది గర్భిణు లకు పండ్లు, పాలు, బ్రెడ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈ కొండయ్య, సూపర్‌వైజర్లు కుసుమ, కృష్ణయ్య, ఏఎన్‌ఎం నాగవేణి, ప్రమీల, సీహెచ్‌వో కుముదా, ల్యాబ్ టెక్నీషియన్ కుమార్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణల పర్వం.. మళ్లీ మొదటికి..!

● డ్రైనేజీపై ఇష్టారాజ్యంగా నిర్మాణాలు

బి.కొత్తకోట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో రోడ్ల ఆక్రమణల పర్వం మళ్లీ మొదటికొస్తోంది. పట్టణంలోని జ్యోతి సర్కిల్‌తో పాటు రంగసముద్రం రోడ్డు, బెంగళూరురోడ్డు, పీటీఎం రోడ్డు, మదనపల్లె రోడ్లలోని డ్రైనేజీలను దుకాణ దారులు, చిరువ్యాపారులు కొన్నేళ్లుగా ఆక్రమించుకున్నారు. ఇటీవల బి.కొత్తకోట నగర పంచాయతీ కమిషనర్‌గా వచ్చిన జీవీ పల్లవి ఈ ఆక్రమణలను పోలీసుల సాయంతో తొలగించారు. ఎన్నిరకాల వత్తిళ్లు వచ్చినా తగ్గకుండా పని పూర్తి చేశారు. అంతవరకు బాగానే ఉన్నా... ఆక్రమణల తొలగింపు సందర్భంగా ధ్వంసం అయిన డ్రైనేజి పునర్నిర్మాణం ఎలా అనే సమస్య తలెత్తింది. రూ.కోట్లతో ప్రతిపాదనలు పంపామని నిధులు రాగానే మెగా డ్రైనేజిని నిర్మిస్తామని నగర పంచాయతీ అధికారులు చెప్పారు. ఈ నేపథ్యంలో దుకాణాల ముందు రాకపోకలకు ఇబ్బంది అంటూ ఎవరికి వారు డ్రైనేజీలపై నిర్మాణాలు చేపట్టారు. కొందరు డ్రైనేజిపై తాత్కాలికంగా బండలు వేసుకోగా, మరికొందరు ఉన్న డ్రైనేజీని కుదించి స్థలం కలిసివచ్చేలా చేసుకున్నారు. ఇంకొందరు తమ ఇష్టం వచ్చినట్టు కాంక్రీటు, సిమెంటు దిమ్మెలు వేసి డ్రైనేజిని దాటి రోడ్డువైపుకు వచ్చేస్తున్నారు. ఆక్రమణల తొలగింపు అనంతరం పర్యవేక్షణ లేకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వస్తోందని పలువురు వాపోతున్నారు. నిధులు విడుదలై మెగా డ్రైనేజి నిర్మాణం చేపట్టాలంటే మరోసారి యుద్ధం చేయాల్సిందేనని, కష్టపడి ఖాళీ చేయించిన స్థలాన్ని కాపాడుకోవాలని కోరుతున్నారు.



జ్యోతిసర్కిల్‌లో డ్రైనేజీని ఆక్రమించి కాంక్రీటు వేసిన దృశ్యం

ఆక్రమిస్తే చర్యలు..

ఆక్రమణల తొలగింపుతో కుచించుకుపోయిన ప్రధాన రోడ్లన్నీ విముక్తి పొందాయి. నిధులు రాగానే శాశ్వత ప్రాతిపదికన మెగా డ్రైనేజి నిర్మిస్తాం. అప్పటిదాకా తాత్కాలికంగా రాకపోకలకు ఏర్పాట్లకు మాత్రమే అనుమతినిచ్చాం. నిబంధనలను ఎవరు అతిక్రమించినా తగు చర్యలు తీసుకుంటాం.

- జీవీ పల్లవి, కమిషనర్, నగర పంచాయతీ

సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం

● తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యమని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రా రెడ్డి తెలిపారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధ వారం తంబళ్లపల్లె నియోజవర్గ స్థాయి ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా దర్బార్‌కు వచ్చే ప్రతి వినతిని కచ్చితంగా పరిష్కరిస్తామన్నారు. భూ మస్యలపైనే అధికంగా అర్జీలు వస్తున్నాయన్నారు. గత వైసీపీ హయాంలో నియోజకవర్గంలో భూ సమస్యలు, ఆక్ర మాలపై బాధితులు వినతులు అందజేస్తున్నారన్నారు. అనంతరం ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరిం చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడుతో పాటు ఆరు మండలాల రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి.. పేదలకు పెన్నిధి

తంబళ్లపల్లె : ములకల చెరువు టీడీపీ కార్యాలయం లో తంబళ్లపల్లె మండలం ఆర్‌ఎన్ తాండాకు చెందిన ఎద్దుల వెంకట్రమణమ్మకు మంజూరైన రూ.32,900 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఆమె భర్త సిద్దమల్‌రెడ్డికి అందచేశారు. ఈ సందర్భంగా దాసరిపల్లి జయ చంద్రారెడ్డి మాట్లాడుతూ...కూటమి ప్రభుత్వం బడు గు, బలహీన వర్గాల సంక్షేమం, ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోందన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరు పేదలను ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వినతి పత్రాలు స్వీకరిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

పేదలు ఆర్థికాభివృద్ధి సాధించాలి : డీఆర్‌డీఏ పీడీ

పెద్దమండ్యం, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి) పేదల ఆర్థికాభివృద్ధికి ప్రణాళిక సిద్ధం చేయాలని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ సీసీలను ఆదేశించారు. పెద్ద మండ్యంలోని స్త్రీ శక్తి భవనంలో బుధవారం సీసీలు, మండల సమాఖ్య సంఘాల లీడర్లతో సమావేశం ని ర్వహించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ గ్రామలలోని డ్వాక్రా సంఘాల మహిళల జీవనోపాధులను గుర్తిం చాలన్నారు. వారి అభివృద్ధికి సరిపడే రుణాల మంజూరు, చెల్లింపుల్లో సీసీలు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. అన్ని విభాగాల్లో వారి అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండల, ని యోజక, జిల్లా స్థాయిలో మహిళా సంఘాలకు నిధు లు కేటాయింపునకు సంబంధించిన నివేదికను ప్రభు త్వానికి పంపుతామన్నారు. ఈ ప్రణాళికలను సకాలం లో పూర్తి చేయాలన్నారు. ఏపీఎం నరసింహులు, మండల సమాఖ్య అధ్యక్షురాలు జరీనా, సీసీలు శంకరమ్మ, భారతి, శ్రీనివాసులు, రెడ్డమ్మ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

వెంకటాద్రి కుటుంబానికి అండగా ఉంటాం

●మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాంబశివరావు

మదనపల్లె, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వాల్మీకిపురానికి చెందిన మాజీ సైనికుడు చంద్రగిరి వెంకటాద్రి కుటుంబానికి అండగా ఉంటామని మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు తెలిపారు. తన భూమి కబ్జాకు గురైందన్న మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న వెంకటాద్రి కుటుంబాన్ని .బుధ వారం ఆయన పరామర్శించారు. మాజీ సైనిక సంక్షేమ సంఘం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం స్థానిక మిషన్ కాంపౌండ్‌లో ఆ సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచెర్ల శ్రీనివాసులునాయుడు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వెంకటాద్రి కుటుంబానికి న్యాయం చేసే క్రమంలో తాము తీసు కోవాల్సిన చర్యలు, భవిష్యత్తు ప్రణాళికపై చర్చించారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని మాజీ సైనికులు తమ సమస్యలను ప్రస్తావించారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచిన సహచరులపై నమోదు చేసిన అక్రమ కేసులు రద్దు చేయాలని, తదితర డిమాండ్లపై వారంతా కలెక్టర్ చామకూరి శ్రీధర్, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ కొండయ్య నాయుడును కలసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పి.విశ్వేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూరెడ్డి శివకుమార్, ఉమ్మడి చిత్తూరు, అనంతపురం, కర్నూలు జిల్లాల మాజీసైనిక సంక్షేమ సంఘం నేతలు, మాజీసైనికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడులే ముద్దు.. ప్రైవేటు వద్దు!

● గ్రామాల్లో అధ్యాపకుల ప్రచారం

నిమ్మనపల్లి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో వి ద్యార్థులను చేర్పించి వారికి మంచి భవి ష్యత్తును ఇవ్వాలని జూనియర్ కళా శాల ప్రిన్సిపాల్ శ్రీధర్ పిలుపునిచ్చారు. పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యా ర్థుల ఇళ్ల వద్దకు వెళ్లి , వారి తల్లిదం డ్రులను సంప్రదిస్తున్నారు. ప్రభుత్వ కళాశాలలో చదివితే ప్రభుత్వం అందిం చే అన్ని పథకాలతో పాటు ఉచితంగా పుస్తకాలు, మధ్యాహ్న భోజనం, నాణ్యమైన విద్య తదితర సౌకర్యాలు అందుతాయని చెబుతున్నారు. ప్రైవేటు కళాశాలల్లో లక్షల రూపాయలను వెచ్చించి నష్టపోకుండా ఉండాలని అవగాహన కల్పించారు. కళా శాలలో నిత్యం క్లాసులు నిర్వహించడంతోపాటు, క్రమశిక్షణ నేర్పేందుకు ఎన్‌సీసీ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సి పాల్ రాధాకృష్ణ, లెక్చరర్లు పాల్గొన్నారు.



ప్రభుత్వ కళాశాలపై అవగాహన కల్పిస్తున్న కళాశాల సిబ్బంది

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

కురబలకోట, ఏప్రిల్9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించా లని ఏపీసీడీవో శిరీష ఆదేశించారు. బుధవారం మండలంలోని ముదివేడు సమీపం లోని కేజీబీవీని తనిఖీ చేశారు. 'ముందుచూపు'నకు సంబంధించిన నో టు పుస్తకాలను పరిశీలించారు. అనంత రం వంటగదిని, స్టాకు రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యా ర్థులకు విద్యతో పాటుగా మంచి ఆహారం పరిసరాల పరి శుభ్రత , ఆరోగ్యకరమైన వాతావరణం ఎంతో ముఖ్యమన్నారు. ప్రతి విద్యార్థి విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు అంకితభావంతో పని చేయాలన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా ప్రణాళికాబద్ధంగా చదివి విజయా లను సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో పర్వీన్‌బాను, బోధన సిబ్బంది నిర్మలమ్మ, ధనలక్ష్మి, శ్రావణి, షబానా, పుష్పలత, సుమలత, రత్నప్రియ, రమణమ్మ, భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలికిరి రానున్న మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి

కలికిరి, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, బీజేపీ నాయకుడు నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి గురువారం రాత్రికి కలికిరి రానున్నట్లు ఆయన వ్యక్తి కార్యదర్శి ఎం. కృష్ణప్ప తెలిపారు. రాత్రి 9 గంటలకు కలికిరిలో బస చేస్తారు.

ఉపాధిహామీ సిబ్బంది చురుగ్గా పనిచేయాలి

బి.కొత్తకోట, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యో తి): ఉపాధిహామీ సిబ్బంది చురు గ్గా పనిచేసి లక్ష్యాలను చేరుకోవా లని అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నందకుమార్‌రెడ్డి ఆదేశించారు. బు .దవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సి బ్బందితో సమీక్షా సమావేశం నిర్వ హించారు. మండలంలో ప్రతిరోజూ 1304 మందికి తగ్గకుండా కూలీలకు పని కల్పించాలన్నారు. ప్రతి పంచాయతీలోనూ జూన్ నెలాఖరుకు 25 ఫారంపాండ్ల నిర్మాణం పూర్తి చేయాలని, 38 నీటితొట్లెలను మూడు రోజులలోగా పూర్తి చేయాలన్నారు. మండలంలో ఉద్యానపంటలపై ఆసక్తి ఉండి 5ఎకరాల లోపు వున్న రైతుల ఎంపిక కోసం గ్రామాలలో సమావేశాలు నిర్వహించి, ఏఏ పంటకు ఎకరాకు ఎంత మొత్తం వస్తుందో వివరించాలని, లబ్ధిదారులను ఎంపిక చేసి, ఎస్టిమేషన్ వేసి పంపాలని టెక్నికల్ అసిస్టెంట్లను ఆదేశించారు. అనంతరం మండలంలోని బడికాయలపల్లెలో ఉపాధి నిధులతో నిర్మిస్తున్న నీటితొట్టెను పరిశీలించారు. ఏపీవో వెంకటేష్, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దారి ఆక్రమణపై తహసీల్దారుకు ఫిర్యాదు

పీలేరు, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): తమ ఇంటికి వెళ్లే దారిని ఆక్రమించుకుని వేధిస్తున్నారం టూ పీలేరు మండలం జాండ్ల పంచాయతీ నల్లగుట్ట పల్లె తాండాకు చెందిన బి.పార్వతి, ఆమె కుటుంబ సభ్యులు తహసీ ల్దారుకు ఫిర్యాదు చేశా రు. నల్లగుట్టపల్లె తాండా పరిధిలోని సర్వే నెం.227-17లో తమకు ప్రభుత్వం గతంలో 4 సెంట్లు భూమి మంజూరు చేయగా తాము అందులో ఇల్లు నిర్మించుకున్నామన్నారు. బతుకుదెరువు కోసం తాము కొన్ని నెలలుగా గ్రామాన్ని వదిలి వెళ్లామని, అదే అదునుగా గ్రామానికి చెందిన విశ్రాంత అధ్యాపకుడు రాజారామ్మోహన్ రెడ్డి దారికి అడ్డంగా రాతి కూసాలు పాతి ఆక్రమించుకున్నాడని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయనను అడిగితే తమను కులం పేరుతో దూషించడమే కాకుండా దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరిస్తు న్నాడన్నారు. ఈ మేరకు ఆమె తన కుమారుడు నరేశ్ నాయక్, కూతురు రాజకు మారితో కలిసి బుధవారం పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావుకు ఫిర్యాదు చేశారు.



తహసీల్దారుకు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

ఆర్టీసీ డ్రైవర్‌పై డీఎంకు ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రత నిబంధనలు పాటించని డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని వన్ డిపో డీఎంకు బుధవారం బాలాజీ అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. బుధవారం ఓ ఆర్టీసీ డ్రైవర్ మల్లికార్జున సర్కిల్ వద్ద రోడ్డుకు అడ్డంగా ఆపడంతోపాటు, వెనక 108 అంబులెన్స్ హారన్ ఇస్తున్నా బస్సు తీయ లేదు. దీంతో ఓ ద్విచక్రవాహనదారుడు ప్రశ్నించగా దుర్భాషలాడాడు. దీంతో ఆ వ్యక్తి ప్రభుత్వ ఆస్పత్రి ముందు బస్సు ఆపి గొడవపెట్టుకున్నాడు, స్థానికులు డ్రై వర్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. పోలీసులు అక్కడి చేరుకుని సారీ చెప్పించారు. వెంటనే వన్ డిపో డీఎం వెంకటరమణారెడ్డికి విషయం తెలియజేస్తూ ఫిర్యాదు చేశారు.

దాడిలో వీఆర్‌ఏకి గాయాలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి):అక్రమంగా పునాదులు వేస్తున్న వారిని అడ్డుకున్నందుకు వీఆర్‌వోపై దాడి చేశారు. తాలూకా సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు మండలంలోని దుబ్బిగానిపల్లెలో బుధవారం రామకృష్ణ అనే వ్యక్తి ఎలాంటి అనుమతులు లేకుండా పునాదులు వేస్తుండగా ఆ గ్రామ వీ ఆర్‌ఏ నారాయణ అక్కడికి వెళ్లి ప్రశ్నించారు. దీంతో రామకృష్ణ దుర్భాషలాడుతూ ఇటుకతో తలపై దాడి చేశాడు. దీంతో గాయపడిన ఆయనను స్థానికులు మదన పల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బీజేపీని బలోపేతం చేయండి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): బీజేపీని రాష్ట్రంలో బలోపేతం చేయాలని బీజేపీ జాతీయ నాయకులు చల్లపల్లె నరసింహారెడ్డి అన్నారు. బుధవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలపై నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించా లన్నారు. భారతదేశాన్ని శక్తింతమైన దేశంగా తీర్చిదిద్దడం, సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పడం బీజేపీ లక్ష్యమన్నారు. 180 మిలియన్ల సభ్యులున్న పార్టీగా ప్రపంచంలోనే పెద్దపార్టీగా అవతరించిందని తెలిపారు. ఇన్నేళ్ల అధికారంలో ఉండడానికి పార్టీ సంస్థాగతంగా బలంగా ఉండడమే ప్రధాన కారణం అన్నారు. ఇందులో క్రియాశీలక కార్యకర్తల పాత్ర ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు మాట్లాడుతూ మోడీ పరిపాలనలో దేశం ప్రపంచంలోనే అగ్రదేశంగా ఎదిగిందన్నారు. సబ్ కా సాథ్, సబ్ కా వికాస్, సబ్ కా విశ్వాస్ అనే సూత్రాల తో కుల, మత బేధాలు లేకుండా పాలన అందిస్తున్న ట్లు చెప్పారు. వక్ఫ్ సవరణ బిల్లుపై ముస్లింలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎప్పుడో తిరస్కరించిన కాంగ్రెస్, దాని తోక పార్టీలు కమ్యూని స్టులు, మైనార్టీలలో అపోహలు కలిగిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. బీజేపీ ఎప్పుడూ మత రాజకీ యాలు చేయదని తెలిపారు. కార్యక్రమంలో విజయ భారతి హైస్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సేతు, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆకుల కృష్ణమూర్తి, ఎల్లంపల్లె ప్రశాంత్, బర్నేపల్లె రవికుమార్, ఓసూరి కిరణ్ కుమార్, బండి ఆనంద్, మండల అధ్యక్షుడు పూల నాగరాజు, మటన్ కిరణ్‌కుమార్, రామిరెడ్డిగారిపల్లె వెంకటరమణారెడ్డి, కోసూరు భవానీ, కోడయ్య, ఆనందకుమార్, సునీల్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చల్లపల్లె నరసింహారెడ్డి

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించండి



డీఐజీ కోయ ప్రవీణ్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేత దొరస్వామినాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

ములకలచెరువు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణ కు సహాయసహకారాలు అందించాలని కర్నూల్ రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ కోరారు. స్థానిక సర్కిల్ కార్యాలయాన్ని బుధవారం తనిఖీ చేసేందుకు వచ్చిన డీఐజీని టీఎస్ఎన్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, టీడీపీ నేత కట్టా దొరస్వామి నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, నేతలు ముత్తుకూరు మౌలా, జేసీబీ సుధాకర్ నాయుడు, విజయ్‌కుమార్, గాండ్ల రెడ్డెప్ప, నాయకులు పురుషోత్తం, వెంకట్‌రెడ్డి, ఆదినారాయణ, ప్రతాప్‌నాయుడు, నాగేంద్ర, ఉమా శంకర్, ఎంఎల్ఆర్ పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమ ని రాటకొండ గురు ప్రసా ద్ తెలిపారు. బుధవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ క ళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ గురుప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థు లు సామాజిక సేవా కార్యక్రమాలతో పాటు రక్తదానంలో పాల్గొనడం అభినందనీయమన్నారు మొత్తం 57 మంది విద్యార్థులు రక్తదానం చేయగా ప్రభుత్వాస్పత్రి రక్తనిధి కేంద్రం వైద్యుడు డాక్టర్ నవీన్ కుమార్, సిబ్బంది సునీత, వనజ, చెన్నకేశవులు, ప్రిన్సిపాల్ రమా దేవి, ఎస్ఎస్ఎస్ అధికారి హేమశేఖర్, ఉదయకుమార్ పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలి



సబ్‌కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చ ట్టం సవరణ బిల్లును రద్దు చేయాలని సీపీఐ జిల్లా కా ర్యదర్శి నరసింహులు డి మాండ్ చేశారు. బుధ వారం స్థానిక సబ్‌కలెక్టరేట్ ఎదుట సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి 11 ఏళ్లు అవుతోందని, ఈ 11 ఏళ్లలో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు, కార్పొరేట్ సంస్థలకు దోచిపెడుతోందన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం మతాల మధ్య చిచ్చులు పెడుతూ మతసామరస్యాన్ని దెబ్బతీస్తోం దన్నారు. ప్రస్తుతం వంటగ్యాస్ సిలెండర్‌పై రూ.50. పెంచి భారం మోపిందన్నారు. వెంటనే వక్ఫ్ సవరణ బిల్లును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు సాంబశివ, కె.మురళి, రెడ్డి, సూర్య, ముబారక్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఐక్యవేదిక కన్వీనర్ల ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘం నాయకులు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 9(ఆంధ్రజ్యోతి): దేశ జనా భాలో సగం ఉన్న బీసీల కు ఆ మేరకు రిజర్వేషన్లు కల్పించాలని బీసీ ఐక్య వే దిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బేబీ వెల్‌కంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 11న నక్కలదిన్నెలోని బీసీ హాస్టల్‌లో జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలు నిర్వహించాలని తీర్మానించారు. అనంతరం కన్వీనర్లుగా జన్నే రాజేంద్రనాయుడు, పొదల నరసింహులు, ఎం. సుబ్రహ్మణ్యం, కె. గంగులప్ప, మడ్డిపల్లె సుబ్రహ్మణ్యం, చెన్నం శ్రీ రాములు, టి. శ్రీదేవి, వి. వినుత, ఎం. చంద్ర, ఎంపీ ఆనందనన్, నాగార్జున, హరి నారాయణ, బడితం వెంకటరమణ, మణిశంకర, సుభాషిణి, తదితరులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ హక్కుల సాధన కోసం పోరాటాలు, ఆందోళన లు చేయక తప్పదని చెప్పారు. బీసీలను అగ్రవర్ణాలకు చెందిన రాజకీయ నాయకులు ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని ఆరోపిం చారు.

ఆంధ్రా పెన్షనర్ల పార్టీ కార్యవర్గం ఎన్నిక



మణికంఠ నారాయణ | మర్రిపాటి రెడ్డెప్ప | గురు నారాయణాచారి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎంఈవో పోతబోలు రెడ్డెప్ప ఆ ధ్వర్యంలో బుధవారం స్థానిక గిరిరావు హై స్కూల్‌లో ఆంధ్రా పె న్షనర్ల పార్టీ కార్యవ ర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడుగా మణికంఠ నారాయణ, సహా య అధ్యక్షుడుగా శివ ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గురునారాయణా చారి, సహాయ కార్యదర్శిగా కృష్ణమూర్తి, కోశాధికారిగా మర్రిపాటి రెడ్డెప్ప, సభ్యులుగా మునిగోటి శ్రీనివాస శర్మ, సయ్యద్ సబీర్‌బాషా ను ఎంపిక చేశారు. తదుపరి సమావేశంలో ఎగ్జిక్యూటివ్ సభ్యులను నియమిస్తామని తెలిపారు.

సమస్యల పరిష్కారానికి ఎన్ఎస్‌యూఐ పోరాటం

పీలేరు రూరల్, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి ఎన్ఎస్ యూఐ ఆవిర్భావం నుంచి అలుపెరగని పోరాటం చే స్తోందని ఆ సంస్థ రాష్ట్ర ఉపాధ్యక్షుడుఅమృత్ తేజ తెలిపారు. పీలేరులో బుధ వారం ఎన్ఎస్‌యూఐ 55వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుంచి పీజీ వరకు పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం ఎన్నో పోరాటాలు చేశామన్నారు. సంక్షేమ హాస్టళ్లలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సాయిసంపత్‌కుమార్, లోకేశ్, రెడ్డిసుబ్రమ ణ్యం, వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, సాంబ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం

పీలేరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): కేవీపల్లె మండలం తువ్వపల్లె గ్రామ పంచాయ తీ కొత్తపల్లెలో అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని బుధవారం అధికారులు, టీడీపీ నేతలు ప్రారంభించారు. ఈ సంద ర్భంగా టీడీపీ నేత ఇరగం రెడ్డి, పంచాయతీ కార్యదర్శి భువ నేశ్వరి, టీడీపీ నాయకులు చల్లా నాగరాజ, వెంకటేశ్వర రావు, ఈ పూరి ఆంజనేయులు, బేతపూడి వెంకటేశ్, ముల్లంగి వెంకటరమణ, అంజనమ్మ, పాల్గొన్నారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

పెద్దమండ్యం, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దమండ్యం ఎంపీడీవో శ్రీధర్‌రావు సూచించారు. బుధవారం తన కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన మాట్లాడుతూ వేసవిలో పని ప్రదేశాల్లో నీరు, నీడ సౌకర్యాలు సమకూర్చుకోవాలన్నారు. వలసల నివారణలో భాగంగా కూలీలకు పనుల వివరాలను తెలియజేయాలన్నారు. పండ్ల తోటల సాగుపై ఆసక్తి కలిగి 5 ఎకరాల లోపు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్‌లు బాధ్యతగా ఉపాధి పనులు చేస్తున్న ప్రాంతంలో కనీస సౌకర్యాలను ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో పశువుల తాగునీటి తొట్టెల పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు.